స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 156 | ఆదివారం, అక్టోబర్ 25, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 12 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 156 | SUNDAY, OCTOBAR 25, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 12 | RS : 5-00 |


## భారీగా విదేశీ కరెన్సీ పట్టివేత

• రూ.1.56 కోట్ల విలువైన కరెన్సీ స్వాధీనం • ఇద్దరు ప్రయాణికుల వద్ద నోట్ల కట్టలు గుర్తింపు • దుస్తుల మధ్య నల్లటి కవర్లలో నగదు దాచివేత • చట్టబద్ధ పత్రాలు లేకపోవడంతో డీఆర్ఐ చర్యలు

2



# రక్షణ రంగంలో తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

• ఏరోస్పేస్ విధానం 2.0 త్వరలో విడుదల • రక్షణ ఉత్పత్తుల తయారీకి హైదరాబాద్ కేంద్రం • పెట్టుబడులు రెట్టింపు చేయాలని పారిశ్రామికవేత్తలకు పిలుపు • 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 24 (వార్తవ వేదిక సూర్య ప్రతినిధి):

ఆయుధ ఎగుమతులు, రక్షణ రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా చూడాలనేది తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ రక్షణ పరిశ్రమకు తెలంగాణ అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా మారాలని చెప్పారు. యుద్ధానికి అవరమైన సాంకేతికతను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయి దేశం ఎదగాలన్నారు. శనివారం రాత్రి తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగిన 'రక్ష ఎక్స్‌పో–2026' ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం కీలకోపన్యాసం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రక్షణ పెట్టుబడుల కమిటీ ఛైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మిగతా 2లో..

## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై మహారాష్ట్రతో రేపు చర్చలు

• ముంబైలో ఫడణవీస్‌తో సీఎం రేవంత్ భేటీ..
• వెంట నీటి పారుదల మంత్రి ఉత్తమ్
• 152 మీటర్ల ఎత్తుకు సమ్మతి కోరనున్న తెలంగాణ
• 150 మీటర్లకయినా ఒప్పించాలని యోచన

2 లో..

# కరువు నివారణకు రూ.150 కోట్ల ప్రణాళిక

• మూడు మండలాల్లో శాశ్వత పరిష్కార చర్యలు • మిడ్జిల్, ఉప్పునూతల, మక్తల్ మండలాల ఎంపిక • ప్రతి గ్రామంలో సభలు నిర్వహించి ప్రజాభిప్రాయాల సేకరణ • నిధుల సద్వినియోగంపై ప్రత్యేక పర్యవేక్షణ: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య ప్రతినిధి):

రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఎప్పుడు ఎదురైనా ప్రజలు, రైతులు వాటిని తట్టుకునేలా మూడు మండలాల్లో రూ.150 కోట్లతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, రైతు కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కరువు ప్రభావం చారిత్రకంగా ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, వర్షాధార వ్యవసాయం అధికంగా ఉన్న జిల్లాలు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలు, రైతు కుటుంబాల జీవన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మండలాలను ఎంపిక చేసినట్లు వివరించారు. జాతీయ విపత్తుల నిర్వహణ నిధి సహకారంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాలోని మిడ్జిల్, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉప్పునూతల, నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలాలను ఈ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసినట్లు మంత్రి తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, విపత్తుల నిర్వహణ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ప్రాజెక్టు కార్యాచరణ, కరువు నిరోధక వ్యవసాయ విధానాల అమలు, నిధుల వినియోగం వంటి అంశాలపై చర్చించారు. ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ పర్యవేక్షణలో వ్యవసాయ శాఖ ప్రధాన సమన్వయ సంస్థగా వ్యవహరించనుంది. ప్రాజెక్టు అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఎంపిక చేసిన ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు, స్థానిక అవసరాలకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గ్రామాల్లో నీటి లభ్యత, సాగునీటి అవసరాలు, తాగునీటి సమస్యలు, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మిగతా 2లో..




# కిలో @రూ.100

• నెల రోజుల్లోనే సన్నబియ్యం ధరలు 25 నుంచి 35 శాతం పెరుగుదల • జై శ్రీరామ్ క్వింటాల్ ధర రూ.6,800 నుంచి రూ.8,500కు చేరిక • హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాలకూ భారీగా పెరిగిన ధరలు • ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వినియోగదారుల డిమాండ్

(హైదరాబాద్, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

తెలంగాణలో సన్నబియ్యం ధరలు గణనీయంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. నెల రోజుల వ్యవధిలోనే పలు రకాల సన్నబియ్యం ధరలు 25–35 శాతం వరకు పెరిగినట్లు వ్యాపార వర్గాల సమాచారం వెల్లడిస్తోంది. ఇదే ధోరణి కొనసాగితే రానున్న మిగతా 2లో..

# సున్నం చెరువు వద్ద అక్రమ బోర్ల తొలగింపు

• హైడ్రా ఆధ్వర్యంలో భారీ తనిఖీలు • ఒకే రోజు 15 బోర్లు తొలగింపు • ఇళ్లలో, వంటగదుల్లోనూ బోర్లు • భూగర్భ పైపుల తొలగింపుతో నీటి అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట

హైదరాబాద్, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

హైదరాబాద్‌లోని సున్నం చెరువు పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన బోర్ల ద్వారా సాగుతున్న నీటి వ్యాపారానికి అడ్డుకట్ట వేసేందుకు హైడ్రా శనివారం భారీ తనిఖీలను చేపట్టింది. చెరువు సమీపంలోని నివాస ప్రాంతాల్లో ఇళ్లలో, పడక గదుల్లో, వంటగదుల్లో సైతం బోర్లు ఏర్పాటు చేసి, అధిక సామర్థ్యం కలిగిన మోటార్లతో నీటిని తోడుతున్న వ్యవహారాన్ని అధికారులు గుర్తించారు. బోర్ల నుంచి తోడిన నీటిని భూగర్భంలో వందల మీటర్ల పొడవున ఏర్పాటు చేసిన పైపుల ద్వారా మరోచోట ఉన్న నీటి నిల్వ ట్యాంకులకు తరలించి, అక్కడి నుంచి పెద్ద నీటి ట్యాంకర్లతో తీసుకెళ్లి చిన్న ట్యాంకర్లలో నింపి విక్రయిస్తున్న తీరును తనిఖీల సందర్భంగా వెలుగులోకి తీసుకొచ్చారు. ప్రజలకు తెలియకుండా చాలాకాలంగా కొనసాగుతున్న ఈ వ్యవహారంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. సీఎంసీ, రెవెన్యూ, జలమండలి అధికారులతో కలిసి సంయుక్తంగా ఈ చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం ఆరున్నర గంటలకు ప్రారంభమైన తనిఖీలు సాయంత్రం మిగతా 2లో..







## మహిళా జర్నలిస్టుల భద్రతకు ప్రాధాన్యం

• ప్రెస్ స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి పునాది • మహిళా జర్నలిస్టులపై దాడుల పట్ల సీతక్క ఆందోళన • ప్రశ్నలను అణచివేయడం కాదు.. సమాధానాలు చెప్పాలి • స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం రాజ్యాంగ విలువలని వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

హైదరాబాద్‌లోని బేగంపేట టూరిజం ప్లాజాలో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సును మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్రికా స్వేచ్ఛ, మహిళా జర్నలిస్టుల భద్రత, వృత్తిపరంగా వారు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆమె మాట్లాడారు. బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు పత్రికా స్వేచ్ఛ పునాది అని పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ వృత్తిని నిర్వహించే వాతావరణాన్ని కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు పోషిస్తున్న పాత్రను గుర్తించాలని సూచించారు. మహిళా జర్నలిస్టుల స్వేచ్ఛను, భద్రతను పరిరక్షించేందుకు ప్రభుత్వాలు, మీడియా సంస్థలు, పౌర సమాజం సమష్టిగా కృషి చేయాలని సీతక్క పిలుపునిచ్చారు. వార్తా సేకరణ సమయంలో మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న బెదిరింపులు, వేధింపులు, దాడుల ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో భాగంగా నిరసన కార్యక్రమాలను కవర్ చేసే జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంలోనూ, ప్రజా సమస్యలను ప్రశ్నించడంలోనూ ఎలాంటి భయాందోళనలకు గురికాకూడదని తెలిపారు. వృత్తిపరమైన స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు తగిన మిగతా 2లో..

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల

# కల నెరవేరుస్తాం

• నివాసయోగ్యమైన ప్రాంతాల్లో స్థలాల కేటాయింపునకు కార్యాచరణ • న్యాయపరమైన చిక్కులు లేని శాశ్వత పరిష్కారంపై దృష్టి • ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పలుమార్లు చర్చించాం • జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

హైదరాబాద్, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, కుటుంబాలతో గౌరవంగా నివసించేందుకు అనువైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారు. గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు మళ్లీ తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని భరోసా ఇచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో జర్నలిస్టుల గృహ నిర్మాణ సంఘా నికి భూములు కేటాయిస్తూ ఉత్తర్వు లు జారీ చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అయితే, ఈ భూముల కేటాయింపునకు సంబంధించిన వ్యవహారం సుప్రీంకోర్టులో న్యాయ వివాదానికి దారితీయడంతో స్థలాల పంపిణీ ప్రక్రియ సుదీర్ఘకాలం నిలిచిపోయిందని తెలిపారు. 2022లో న్యాయపరమైన మిగతా 2లో..






# తెలంగాణలో కరవు.. నీటి ఎద్దడి

• 18 జిల్లాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులంటూ ఆందోళన • 331 మండలాల్లో కరువు ఛాయలు కమ్ముకున్నాయని వెల్లడి • చెరువుల్లో అడుగంటిన నీటిమట్టాలు.. సాగుకు ఇబ్బందులు • అడవుల్లోనూ ఎండిన నీటి వనరులు.. వన్యప్రాణులకు కష్టాలు

హైదరాబాద్, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కరువు పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అందిన వివరాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని, 331 మండలాల్లో కరువు ఛాయలు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితులు, చెరువుల్లో నీటిమట్టాలు తగ్గిపోవడం, సాగునీటి వనరులు అడుగంటడం వంటి పరిణామాలు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వర్షాలపై ఆధారపడి పంటలు సాగుచేసే రైతులు నీటి లభ్యతపై ఆందోళన చెందుతున్నారు. తాగునీటి అవసరాలను తీర్చడం, పంటలకు నీరందించడం, గ్రామీణ ప్రాంతాల్లో నీటి కొరతను అధిగమించడం ప్రభుత్వ యంత్రాంగానికి కీలక సవాలుగా మారుతున్నాయి. రాష్ట్రంలోని చెరువుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని అందించిన గణాంకాలు మిగతా 2లో..

వార్త వేదిక సూర్య VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 156 ఆదివారం 25 అక్టోబర్, 2026

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కల నెరవేరుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అడ్డంకులు తొలగి నప్పటికీ, జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు అందించే విషయంలో గతంలో పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. దీంతో అనేక సంవత్సరాలుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆశలు నెరవేరకుండా పోయాయని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చొరవ తీసుకుందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2024 సెప్టెంబరు 8న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో జర్నలిస్టుల గృహ నిర్మాణ సంఘానికి భూమిని అప్పగించినట్లు గుర్తుచేశారు. అయితే, సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావడంతో ఈ వ్యవహారానికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చలు జరిపి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే అంశంపై సమగ్రంగా సమీక్షించినట్లు వెల్లడించారు. జర్నలిస్టుల సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎదురైన న్యాయపరమైన ఇబ్బందులు పునరావృతం కాకుండా, చట్టపరమైన వివాదాలకు తావులేని విధంగా స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కుటుంబాలతో నివసించేందుకు అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయడంతో పాటు, కేటాయింపుల ప్రక్రియలో చట్టపరమైన అంశాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించామని, మరోసారి తమ ప్రభుత్వంలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేయడంలో వారి సేవలు ముఖ్యమైనవని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, వారి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు అవసరమైన వసతులు కల్పించడంలో భాగంగా ఇళ్ల స్థలాల అంశాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

## భారీగా విదేశీ కరెన్సీ పట్టివేత

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ మొత్తంలో విదేశీ కరెన్సీని రెవెన్యూ నిఘా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు ప్రయాణికుల వద్ద కలిపి రూ.1.56 కోట్ల విలువైన విదేశీ నగదును గుర్తించి పట్టుకున్నారు. అమెరికా డాలర్లు 1,64,200, మలేషియా రింగిట్లు 3,773, సింగపూర్ డాలర్లు రెండు స్వాధీనం చేసుకున్నట్లు అందిన సమాచారం వెల్లడిస్తోంది. విదేశీ కరెన్సీని తరలిస్తున్న ప్రయాణికులు దానిని సాధారణంగా తీసుకెళ్తున్నట్లు కనిపించే ట్రాలీ బ్యాగుల్లో దాచినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటన విమానాశ్రయంలో తనిఖీల సందర్భంగా వెలుగులోకి వచ్చింది. ప్రయాణికుల ట్రాలీ బ్యాగుల్లోని దుస్తుల మధ్య నల్లటి ప్లాస్టిక్ కవర్లలో విదేశీ కరెన్సీని దాచిపెట్టినట్లు అధికారులు గుర్తించారు. తనిఖీల్లో మొదట ఒక ప్రయాణికుడి వద్ద సుమారు రూ.63.62 లక్షల విలువైన విదేశీ కరెన్సీ లభించినట్లు సమాచారం. కరెన్సీని తీసుకెళ్లేందుకు అవసరమైన చట్టబద్ధమైన పత్రాలను చూపించకపోవడంతో అధికారులు నగదును స్వాధీనం చేసుకున్నారు. విదేశీ కరెన్సీని ఏ అవసరానికి తరలిస్తున్నారు, దాని కి సంబంధించిన పత్రాలు ఉన్నాయా అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టారు.

# ఎగుమతుల్లో నంబర్ 1 కావాలి

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు, కార్మిక మంత్రి జి.వివేక్, మాజీ ఎయిర్‌చీఫ్ మార్షల్ వివేక్ రామ్‌చౌదరి, 90 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రక్షణ రంగంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన, అగ్రగామి దేశంగా తీర్చిదిద్దేందుకు పారిశ్రామికవేత్తలు, పరిశోధనా సంస్థలు, సాంకేతిక నిపుణులు సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని దేశ రక్షణ ఉత్పత్తుల తయారీకి ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా త్వరలోనే 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0'ను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో భాగంగా నిర్వహించిన రక్షా ఎక్స్‌పో 2026 ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యుద్ధ అవసరాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయి నుంచి బయటపడి, స్వదేశంలోనే అత్యాధునిక రక్షణ పరికరాలను తయారు చేయడమే కాకుండా వాటిని ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదగాలని ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు.

తెలంగాణను దేశ రక్షణ పరిశ్రమకు అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పెట్టుబడిదారులు ముందుకు రావాలని రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే రూపొందించుకున్న ప్రణాళికలను రెట్టింపు చేయాలని సూచించారు. పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పరిశ్రమల ఏర్పాటుకు ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రక్షణ ఉత్పత్తుల తయారీతోపాటు అంతరిక్ష పరిశోధనలు, విమానయాన సాంకేతికత, సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు, డ్రోన్ పరిజ్ఞానం వంటి రంగాల్లోనూ తెలంగాణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ రంగాల్లో పనిచేస్తున్న దేశీయ, అంతర్జాతీయ సంస్థలు పరస్పరం సహకరించుకోవడం ద్వారా కొత్త



పరిశ్రమలు, పరిశోధనా కేంద్రాలు ఏర్పడతాయని, తద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణను 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గతేడాది తెలంగాణ రైజింగ్ 2047 దార్శనిక పత్రాన్ని విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం దేశ జనాభాలో తెలంగాణ వాటా రెండున్నర శాతానికి పైగా ఉండగా, దేశ స్థూల జాతీయోత్పత్తిలో రాష్ట్రం సుమారు ఐదు శాతం వాటాను అందిస్తోందని పేర్కొన్నారు. 2047 నాటికి ఈ వాటాను పది శాతానికి పెంచాలన్నది తమ లక్ష్యమని వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో రక్షణ పరికరాల తయారీ, విమానయాన పరిశ్రమ, అంతరిక్ష సాంకేతికత, వాటికి అనుబంధంగా పనిచేసే సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రక్షా ఎక్స్‌పోను ఈ రంగాల్లోని సంస్థలు తమ ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు, పెట్టుబడుల అవకాశాలను అన్వేషించేందుకు, కొత్త భాగస్వామ్యాలను ఏర్పరచుకునేందుకు ఉపయోగపడే అంతర్జాతీయ వేదికగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతోపాటు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో యుద్ధ స్వరూపం వేగంగా మారుతుందని, డ్రోన్లు, రోబోలు, కృత్రిమ మేధస్సుతో పనిచేసే వ్యవస్థలు రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించనున్నాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా దేశీయ పరిశోధనలు, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్ ఇప్పటికే అనేక రక్షణ పరిశోధనా సంస్థలు, తయారీ కేంద్రాలకు నిలయంగా ఉందని, భారత సైన్యం, వైమానిక దళాలకు సంబంధించిన వ్యూహాత్మక కార్యకలాపాల్లోనూ నగరానికి ప్రాధాన్యం ఉందని వివరించారు. సముద్రతీరం లేని రాష్ట్రం అయినప్పటికీ తెలంగాణ భారత నౌకాదళానికి అవసరమైన సేవలు అందిస్తోందని తెలిపారు. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వు అటవీ ప్రాంతంలో అత్యల్ప పౌనఃపున్య నౌకాదళ రాడార్ కేంద్రం నిర్మాణం జరుగుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థ, భారత్ డైనమిక్స్, మిశ్రధాతు నిగమ్, టాటా సంస్థలు, ఎయిర్‌బస్, సాఫ్రాన్, స్కైరూట్, లాక్‌హీడ్ మార్టిన్, భారత్ ఫోర్జ్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ పోలీసు శాఖాధిపతి సీవీ ఆనంద్, రక్షణ రంగానికి చెందిన ప్రస్తుత, మాజీ ఉన్నతాధికారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా హాజరయ్యారు. భారత్ ఫోర్జ్ సంస్థ అధినేత బాబా ఎన్. కల్యాణి, స్కైరూట్ సంస్థ సహవ్యవస్థాపకుడు పవన్ కుమార్ చందన, రక్షణ పరిశోధన సంస్థ మాజీ అధిపతి డాక్టర్ జి. సతీష్ రెడ్డి, లాక్‌హీడ్ మార్టిన్, సాఫ్రాన్, ఎయిర్‌బస్, ధ్రువ స్పేస్, ఎల్ అండ్ టీ సంస్థల ప్రతినిధులు పాల్గొని రక్షణ, అంతరిక్ష రంగాల్లో పెట్టుబడులు, సాంకేతిక సహకార అవకాశాలపై చర్చించారు. వచ్చే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ముఖ్యమంత్రి ప్రతినిధులను ఆహ్వానించారు. రక్షా ఎక్స్‌పో ద్వారా దేశీయ, అంతర్జాతీయ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, తెలంగాణను రక్షణ ఉత్పత్తుల తయారీ, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## తుమ్మిడిహెట్టిపై రేపు చర్చలు

హైదరాబాద్, అక్టోబరు 24 (వార్త వేదిక సూర్య):

ప్రాణహితపై 152 మీటర్ల ఎత్తుతో తలపెట్టిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సమ్మతి కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మహారాష్ట్ర వెళుతున్నారు. ఆదివారం రాత్రి ముంబై చేరుకుంటారు. సోమవారం ఉదయం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో భేటీ కానున్నారు. సమావేశానికి అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని ఫడ్నవీస్ సూచనప్రాయంగా తెలియజేశారని ముఖ్యమంత్రి రేవంత్ ఇటీవల వెల్లడించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడానికి వీలుగా సహకారం అందించాలని ప్రధాని నరేంద్రమోదీతో పాటు జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌లను ముఖ్యమంత్రి పలుమార్లు నేరుగా కలిసి విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రికి ఇదే విషయమై పలు లేఖలు రాశారు. ఇటీవలే ప్రధాని కార్యాలయం సీఎం విజ్ఞప్తికి స్పందించి కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారులతో సమావేశం కూడా నిర్వహించింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించి, 76.650 కిలోమీటర్ల మేర గ్రావిటీతో 80 టీఎంసీల జలాలను తరలించడం వల్ల ఏటా రూ. 383.50 కోట్ల కరెంట్ బిల్లుల భారం తప్పుతుందని ప్రభుత్వం ఇప్పటికే లెక్క కట్టింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం వల్ల 76.65 కిలోమీటర్ల మేర గ్రావిటీతో తరలించి, మరో 20.90 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వి నీటిని వదిలితే 8.25 కిలోమీటర్లు గ్రావిటీతో నీళ్లు వెళ్లి సుందిళ్ల బ్యారేజీలో చేరతాయని మహారాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించనున్నారు. తుమ్మిడిహెట్టి గ్రామం వద్ద వార్ధా నదిపై ఒకటి, వెన్‌గంగాపై మరోటిబ్యారేజీ ఒకే కాంప్లెక్స్‌గా కడతారు. లంబాకారంలో బ్యారేజీ నిర్మాణం ఉండనుంది. 152 మీటర్ల ఎత్తుతో ప్రతిపాదనలు సిద్ధం చేసినా మహారాష్ట్ర గట్టి పట్టు పడితే 150 మీటర్లతో అయినా సమ్మతి సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 150 మీటర్ల ఎత్తుతో కట్టినా, లేక 152 మీటర్ల ఎత్తుతో నిర్మించినా గ్రామాలు ముంపునకు గురి కావని రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు వేస్తోంది. 150 మీటర్ల ఎత్తుతో అయితే 413 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంటుందని, చాప్రాల ఎకో సెన్సివిటీ జోన్‌లో 382 హెక్టార్ల మేర ముంపునకు గురవుతుందని, తెలంగాణలో 450 హెక్టార్లు మహారాష్ట్రలో 1,256 హెక్టార్లు కలుపుకొని నదీ గర్భం 1,706 హెక్టార్లు ముంపునకు గురవుతుందని వివరిస్తారు. 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కడితే 1174 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంటుందని, తెలంగాణలో 556 హెక్టార్లు, మహారాష్ట్రలో 1,600 హెక్టార్లు కలిపి 2,156 హెక్టార్ల నదీ గర్భం ముంపునకు గురవుతుందని, 545 హెక్టార్ల చాప్రాల ఎకో సెన్సివిటీ జోన్ ముంపునకు గురవుతుందని గుర్తించారు.

# మహిళా జర్నలిస్టుల భద్రతకు ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ జరిగిన నిరసనలను కవర్ చేస్తున్న మహిళా జర్నలిస్టులపై దాడులు, వేధింపులు జరిగినట్లు వచ్చిన నివేదికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని మంత్రి వ్యాఖ్యానించారు. వార్తలను సేకరించడం, సంఘటనలను ప్రజలకు తెలియజేయడం జర్నలిస్టుల వృత్తిపరమైన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నలు అడిగే హక్కును గౌరవించాలని, ప్రశ్నలను అణచివేయడం ప్రజాస్వామ్య బలానికి నిదర్శనం కాదని అన్నారు. ప్రశ్నలకు ధైర్యంగా సమాధానాలు చెప్పగలగడమే ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. జర్నలిస్టులపై దాడులకు సంబంధించిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె వ్యాఖ్యల సారాంశం. భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్ పాలనలో మహిళల స్వేచ్ఛ, భద్రతపై దాడులు పెరిగాయని సీతక్క విమర్శించారు. మహిళలకు సమాన హక్కులు, గౌరవం కల్పించేందుకు రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మనుస్మృతి భావజాలాన్ని తిరస్కరించి, భారత రాజ్యాంగం ప్రతిపాదించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ సూత్రాలను పరిరక్షించాలని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ విలువలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం కల్పించే దిశగా మార్గనిర్దేశం చేస్తాయని తెలిపారు. మహిళల హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ, భద్రతకు భంగం కలగకుండా ప్రజాస్వామ్య వ్యవస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు పత్రికా స్వేచ్ఛ, వృత్తిపరమైన భద్రత, లింగ సమానత్వం వంటి అంశాలపై చర్చించేందుకు వేదికగా నిలిచింది. వార్తా సేకరణ సమయంలో మహిళా జర్నలిస్టులు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మీడియా సంస్థలు తమ సిబ్బందికి భద్రతా మార్గదర్శకాలు కల్పించడం, ఫిర్యాదులపై స్పందించే వ్యవస్థలను బలోపేతం చేయడం, విధి నిర్వహణలో ఎదురయ్యే వేధింపులను నిరోధించడం వంటి చర్యలు కీలకమని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ అత్యంత ముఖ్యమని, మహిళా జర్నలిస్టులు నిర్భయంగా పనిచేసే పరిస్థితులను కల్పించడం సమాజం మొత్తానికి సంబంధించిన బాధ్యత అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## సున్నం చెరువు వద్ద అక్రమ బోర్ల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

వరకు కొనసాగగా, మధ్యాహ్నానికి 15 అక్రమ బోర్లను అధికారులు తొలగించారు. బోర్లకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన భూగర్భ పైపులను సైతం గుర్తించి తొలగించే ప్రక్రియ చేపట్టారు. సున్నం చెరువు నీటిని అక్రమంగా తోడేస్తున్నారంటూ స్థానికుల నుంచి అందిన ఫిర్యాదులు ఈ చర్యలకు ప్రధాన కారణంగా నిలిచాయి. చెరువు పరిధిలో గతంలోనే పదుల సంఖ్యలో బోర్లు ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నట్లు గుర్తించిన హైడ్రా, అప్పట్లో వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టింది. చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను సుమారు పది అడుగుల మేర తొలగించడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు అవకాశం ఏర్పడిందని అధికారులు పేర్కొంటున్నారు. దీనివల్ల భూగర్భ జలాల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడినప్పటికీ, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ బోర్ల ద్వారా నీటిని నిరంతరం తోడేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. పెద్ద సంఖ్యలో నీటి ట్యాంకర్లు వచ్చి నీటిని తరలించడంతో చెరువులో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు అభివృద్ధి ద్వారా లభించాల్సిన ప్రయోజనాలు స్థానిక ప్రజలకు అందకుండా, కొందరు నీటి వ్యాపారులు వాణిజ్య అవసరాల కోసం నీటిని వినియోగిస్తున్నారనే ఫిర్యాదులపై అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో నవభారత్‌నగర్, బోరబండ మూడో దశ ప్రాంతాల్లోనూ తనిఖీలు నిర్వహించి అక్రమ బోర్ల తొలగింపును చేపట్టారు. ఈ తనిఖీల్లో అధికారులు గుర్తించిన అంశాలు స్థానికులను ఆశ్చర్యానికి గురిచేశాయి. సాధారణంగా నివాస అవసరాల కోసం నిర్మించిన ఇళ్లలోని పడక గదులు, వంటగదులు, నీటి సంపుల వద్ద బోర్లు ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నట్లు గుర్తించారు. కొన్ని చోట్ల బోర్ల నుంచి నీటిని దూర ప్రాంతాల్లో ఉన్న ట్యాంకులకు తరలించేందుకు భూగర్భంలో పైపుల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ బోర్లకు అమర్చిన మోటార్లను తొలగించడంతో పాటు, అక్రమంగా నీటిని తరలించేందుకు ఉపయోగిస్తున్న అనుసంధానాలను తొలగించే చర్యలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా స్థానికులు తమ నీటి కష్టాలను అధికారులకు వివరించారు. గతంలో సుమారు 60 అడుగుల లోతులోనే నీరు లభించేదని, ప్రస్తుతం 600 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు పడటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. బోర్లు ఎండిపోవడం, మోటార్లు కాలిపోవడంతో తాగునీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అదే సమయంలో తమ ప్రాంతంలోని నీటిని కొందరు భారీ స్థాయిలో తోడేసి విక్రయించడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతోందని ఆరోపించారు. సున్నం చెరువు పరిసరాల్లో నీటి నాణ్యతపై గతంలో నిర్వహించిన పరీక్షల్లోనూ ఆందోళనకర అంశాలు వెలుగులోకి వచ్చినట్లు హైడ్రా వెల్లడించింది. కాలుష్య నియంత్రణ మండలి ద్వారా పరీక్షలు నిర్వహించగా, కొన్ని బోర్ల నీటిలో కాడ్మియం, సీసం, నికెల్ వంటి హానికర లోహాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారని తెలిపింది. ఈ నీటిని తాగడం వల్ల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

## కరువు నివారణకు రూ.150 కోట్ల ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

గ్రామస్థులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రాజెక్టు లక్ష్యాలు క్షేత్రస్థాయిలో నెరవేరుతాయని పేర్కొన్నారు. స్థానిక పరిస్థితులకు సరిపోయే పనులను గుర్తించి, వాటికి ప్రాధాన్య క్రమం నిర్ణయించాలని తెలిపారు. మహిళలు, యువత, రైతులు, సంప్రదాయ కులవృత్తులపై ఆధారపడిన కుటుంబాల అవసరాలను కూడా ప్రణాళికల్లో భాగం చేయాలని ఆదేశించారు. కరువు ప్రభావం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా గ్రామీణ ఉపాధి, కుటుంబ ఆదాయాలు, సంప్రదాయ వృత్తులపైనా ప్రభావం చూపుతుందని మంత్రి పేర్కొన్నారు. అందువల్ల నీటి వనరుల సంరక్షణతోపాటు ప్రజల జీవనోపాధిని మెరుగుపరిచే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను తగ్గించడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవడం, గ్రామీణ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ అవకాశాలను మెరుగుపరచడం వంటి అంశాలను ప్రణాళికల్లో పరిశీలించాలని తెలిపారు. ప్రాజెక్టు ద్వారా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతోపాటు, భవిష్యత్తులో కరువు వచ్చినప్పుడు దాని ప్రభావాన్ని తగ్గించేందుకు అవసరమైన వ్యవస్థలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. నిధుల కేటాయింపు, పనుల ఎంపిక, అమలు, క్షేత్రస్థాయి ఫలితాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కేవలం నిధులు ఖర్చు చేయడం లేదా పనులు పూర్తి చేయడమే కాకుండా, వాటి వల్ల ప్రజలకు ఎంత ప్రయోజనం కలిగింది, కరువు ప్రభావాన్ని తగ్గించడంలో ఎంత పురోగతి సాధించామనే అంశాలను కూడా అంచనా వేయాలని తెలిపారు. ఈ సమీక్షలో విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ, వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకుడు ఎన్. గోపి తదితర అధికారులు పాల్గొన్నారు.

## కిలో @రూ.100

(మొదటి పేజీ తరువాయి)

నెలల్లో ధరలు మరో 25 నుంచి 30 శాతం పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు బియ్యం ధరల పెరుగుదల మరింత భారంగా మారుతోంది. ప్రతి ఇంట్లోనూ రోజువారీ ఆహారంలో ప్రధాన భాగమైన బియ్యం ధరలు పెరగడం వల్ల నెలవారీ ఖర్చులను సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మార్కెట్లో సరఫరా తగ్గితే ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పలు ప్రముఖ సన్నబియ్యం రకాల ధరలు ఇటీవల భారీగా పెరిగాయి. నెల రోజుల క్రితం క్వింటాల్ జై శ్రీరామ్ పాత బియ్యం ధర రూ. 6,800 ఉండగా, ప్రస్తుతం రూ.8,500కు చేరినట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. హెచ్ఎంటీ బియ్యం ధర రూ. 5,800 నుంచి రూ.7,000కు పెరిగింది. ఆర్ఎన్ఆర్ ఉప్పుడు బియ్యం ధర రూ.5,800 నుంచి రూ.7,200కు చేరింది. సాంబా మసూరి రకం ధర కూడా క్వింటాల్‌కు రూ.4,600 నుంచి రూ.5,800కు పెరిగినట్లు సమాచారం. ఈ ధరల పెరుగుదల చిల్లర మార్కెట్‌పైనా ప్రభావం చూపుతోంది. కొన్ని రకాల సన్నబియ్యం కిలో ధర రూ.100కు చేరే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అయితే, ప్రాంతం, నాణ్యత, బియ్యం రకం, విక్రయ కేంద్రాన్ని బట్టి చిల్లర ధరల్లో వ్యత్యాసాలు ఉండవచ్చు.

ఇతర రాష్ట్రాల్లో వర్షపాతం లోపించడం, ఎల్‌నినో ప్రభావంతో వరి దిగుబడులు తగ్గాయనే అంచనాలు సన్నబియ్యం ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయని వ్యాపారులు వివరిస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కొనుగోలుదారులు తెలంగాణలోని సన్నవరి ధాన్యాన్ని రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. దీంతో స్థానికంగా ధాన్యానికి డిమాండ్ పెరిగి ధరలు పైకి కదులుతున్నాయని చెబుతున్నారు. రైతులకు వారం రోజుల వ్యవధిలోనే క్వింటాల్ ధాన్యానికి లభించే ధర రూ.3,800 నుంచి రూ.4,000–రూ.4,200 వరకు పెరిగినట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. బీపీటీ, తెలంగాణ సోనా, హెచ్ఎంటీ, జై శ్రీరామ్ రకాలకు దేశీయ మార్కెట్‌తోపాటు విదేశీ మార్కెట్లలోనూ డిమాండ్ ఉండటంతో కొనుగోళ్ల పోటీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత నిబంధనలు, తరుగులు, చెల్లింపుల్లో జాప్యం వంటి సమస్యలను తప్పించుకునేందుకు కొందరు రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. మార్కెట్లో ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు మెరుగైన ధర లభించే అవకాశం ఉన్నప్పటికీ, వినియోగదారులకు మాత్రం బియ్యం కొనుగోలు ఖర్చు పెరుగుతోంది. సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించినప్పటికీ, మార్కెట్‌లో ధరలు ఇప్పటికే రూ.4,000 దాటాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు, ధరల పెరుగుదలకు అనుగుణంగా సరిపడా నిల్వలు సమకూర్చుకోవడం, సరఫరాను నియంత్రించడం వంటి అంశాల్లో ప్రభుత్వం మరింత చురుగ్గా వ్యవహరించాలనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, ప్రస్తుత నిల్వలు, ప్రభుత్వ కొనుగోళ్లు, సరఫరా స్థితిపై అధికారిక గణాంకాలు పరిశీలించినప్పుడే కొరత తీవ్రతపై స్పష్టత వస్తుంది.

బియ్యం ధరలు మరింత పెరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వినియోగదారులు, నిపుణులు కోరుతున్నారు. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ధాన్యం, బియ్యం నిల్వలను పరిశీలించడం, గోదాముల్లో నిల్వల వివరాలను పర్యవేక్షించడం, కృత్రిమ కొరత సృష్టించే నిల్వదారులపై చర్యలు తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు ధాన్యం తరలింపుపై వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసి, రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూస్తూనే స్థానిక వినియోగదారులకు సరిపడా బియ్యం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అభిప్రాయపడుతున్నారు. ధరల నియంత్రణలో జాప్యం జరిగితే చిల్లర మార్కెట్లో బియ్యం మరింత ఖరీదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రైతుల ప్రయోజనాలు, వినియోగదారుల కొనుగోలు సామర్థ్యం రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమతుల్య విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది.

## తెలంగాణలో కరువు.. నీటి ఎద్దడి

(మొదటి పేజీ తరువాయి)

సూచిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 6,123 చెరువుల్లో చుక్క నీరు కూడా లేని పరిస్థితి ఉందని, సుమారు 21,500 సాగునీటి చెరువుల్లో ప్రస్తుతం 550 చెరువుల్లో మాత్రమే నీరు ఉందని పేర్కొంటున్నారు. ఈ గణాంకాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉన్నప్పటికీ, చెరువుల్లో నీటి నిల్వల స్థితిపై సమగ్ర సమీక్ష అవసరాన్ని ఇవి ముందుకు తెస్తున్నాయి. చెరువులు ఎండిపోవడం వల్ల భూగర్భ జలాల పునరుద్ధరణకు ఆటంకం ఏర్పడటంతోపాటు, బావులు, బోరుబావుల్లో నీటి లభ్యత కూడా తగ్గే ప్రమాదం ఉంది. సాగునీటి కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన పరిస్థితులు రైతులకు అదనపు ఆర్థిక భారాన్ని కలిగించే అవకాశం ఉంది. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో కరువు ప్రభావం మరింత తీవ్రంగా ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నల్లగొండ, గద్వాల, వనపర్తి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి సహా పలు జిల్లాల్లో నీటి ఎద్దడి నెలకొన్నట్లు అందిన సమాచారం పేర్కొంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పశువులకు నీటి లభ్యత, పంటల సాగు వంటి అంశాలపై కరువు ప్రభావం పడే అవకాశం ఉంది. వర్షాలు సమృద్ధిగా కురవకపోతే ఇప్పటికే తగ్గిన నీటి నిల్వలు మరింత క్షీణించవచ్చు. ఈ నేపథ్యంలో నీటి అవసరాలను గుర్తించి, అత్యవసర ప్రాంతాలకు ప్రాధాన్య క్రమంలో సరఫరా చేయడం, నీటి వృథాను అరికట్టడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించడం అత్యంత కీలకంగా మారుతున్నాయి. కరువు ప్రభావం అడవులకూ విస్తరిస్తోందనే ఆందోళనలు ప్రకృతి ప్రేమికుల్లో వ్యక్తమవుతున్నాయి. అడవుల్లోని సహజ నీటి వనరులు ఎండిపోతే వన్యప్రాణులకు తాగునీరు దొరకడం కష్టమవుతుంది. నీటి కోసం అవి జనావాసాల వైపు వచ్చే ప్రమాదం ఉండటంతో మనుషులు, వన్యప్రాణుల మధ్య ఘర్షణలు పెరిగే అవకాశముంది. అటవీ ప్రాంతాల్లో నీటి లభ్యతను అంచనా వేయడం, అవసరమైన చోట్ల నీటి వసతులు కల్పించడం, సహజ నీటి వనరుల పరిరక్షణకు చర్యలు చేపట్టడం అటవీ శాఖకు ముఖ్యమైన బాధ్యతగా మారుతోంది. అదే సమయంలో గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి, నీటి సరఫరా వ్యవస్థలను పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశాలపై ముందస్తు హెచ్చరికలు వచ్చినప్పటికీ, నీటి నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోలేదని ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే, రాష్ట్రంలోని ప్రస్తుత కరువు పరిస్థితులకు కారణాలు, నీటి నిల్వల స్థితి, ముందస్తు చర్యల అమలు వంటి అంశాలను అధికారిక గణాంకాల ఆధారంగా సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తీవ్రరూపం దాల్చకుండా వర్షపు నీటిని నిల్వ చేయడం, చెరువులను పునరుద్ధరించడం, భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవడం, పంటల సాగులో నీటి పొదుపు పద్ధతులను ప్రోత్సహించడం అవసరం.



# యాదాద్రి భువనగిరి

# పీఎం రాహత్ పథకాన్ని అమలు చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



**యాదాద్రి భువనగిరి బ్యూరో,అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):**

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో వైద్య చికిత్స అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రమాద బాధితులకు చికిత్స ఖర్చుతో సంబంధం లేకుండా సమీపంలోని ఆసుపత్రుల్లో తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాద బాధితుల చికిత్స పథకం–2025 కింద పీఎం రాహత్ పథకం అమలుపై రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఈ సమావేశానికి హాజరయ్యారు. పీఎం రాహత్ పథకం అమలు విధానం, ఆసుపత్రుల్లో బాధితులకు వైద్య సేవలు అందించే ప్రక్రియ, ప్రమాద వివరాల నమోదు, క్లెయిమ్‌ల ఆమోదం, నిధుల విడుదల, తదితర అంశాలను ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి వైద్య చికిత్స అందించడం అత్యంత కీలకమని తెలిపారు. గోల్డెన్ అవర్‌లో తగిన చికిత్స అందించడం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రమాద బాధితులను చికిత్స ఖర్చుల గురించి ఆలోచించకుండా సమీపంలోని ప్రభుత్వ (లేదా) పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. పీఎం రాహత్ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల వరకు చికిత్స ఖర్చును నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఈ పథకం కింద చికిత్స పొందుతున్న ప్రమాద బాధితుల సంఖ్య తక్కువగా ఉందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పథకం ప్రయోజనాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఆదేశించారు. పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఏటా సుమారు రూ.100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధులను ఆదా చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాద బాధితులకు మొదట పీఎం రాహత్ పథకం కింద నిర్దేశిత పరిమితి వరకు చికిత్స అందించాలని, ఆ పరిమితి దాటిన తర్వాత కూడా వైద్యపరంగా అవసరమైతే నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించి బాధితుల ప్రాణాలను కాపాడాలని సూచించారు. పీఎం రాహత్ పథకాన్ని అమలు చేసేందుకు జిల్లాల్లోని అన్ని ఆసుపత్రులు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ పథకం అమలుకు అవసరమైన నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నమోదైన ఆసుపత్రుల్లో ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అర్హులైన బాధితులకు పథకం ప్రయోజనాలు అందకుండా ఉండే పరిస్థితులు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ, పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులు రోడ్డు ప్రమాద కేసులను నేషనల్ హెల్త్ అథారిటీకి చెందిన టీఎంఎస్ 2.0 పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఈ–డీఏఆర్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు అవసరమైన ధ్రువీకరణలు, ఆమోదాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు నమోదైన కేసులకు సంబంధించి ఆసుపత్రుల నుంచి వచ్చే ధ్రువీకరణ అభ్యర్థనలను పోలీసు అధికారులు వెంటనే పరిశీలించి ఈ–డీఏఆర్ పోర్టల్‌లో ఆమోదించాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాద కేసుల వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. ప్రమాద వివరాల నమోదు (లేదా) పోలీసు ధ్రువీకరణలో జాప్యం కారణంగా బాధితులకు చికిత్స అందడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని తెలిపారు. ఆసుపత్రులు సమర్పించిన చికిత్స క్లెయిమ్‌లను సంబంధిత పోర్టల్‌లో పరిశీలించి ఆమోదించిన అనంతరం, పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ఆసుపత్రులకు నిధులు విడుదల చేసే ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. పథకం అమలులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ నియమించిన ఫిర్యాదుల పరిష్కార అధికారి ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రతి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో ప్రమాదాల వివరాలు, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, పెండింగ్ కేసులు, క్లెయిమ్‌ల ఆమోదం, ఆసుపత్రులకు నిధుల చెల్లింపులపై సమీక్షించాలని సూచించారు. జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారిని జిల్లా రోడ్డు భద్రతా కమిటీలో క్రియాశీల సభ్యుడిగా చేర్చి, ఈ–డీఏఆర్, పీఎం రాహత్ పోర్టళ్ల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారం పొందాలని తెలిపారు. ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, బాధితులకు చికిత్స పూర్తికాక ముందే పథకానికి సంబంధించిన ప్రక్రియల కారణంగా ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి చేసే పరిస్థితి రాకుండా చూడాలని స్పష్టం చేశారు. పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నెక్స్ట్ జెన్ ఎం–పరివాహన్ మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ యాప్ ద్వారా రోడ్డు ప్రమాదాల సమాచారం అందించడం, క్లెయిమ్‌ల స్థితిని తెలుసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పీఎం రాహత్ పథకం కింద జిల్లాలోని అన్ని ఆసుపత్రులు సంబంధిత పోర్టల్ నమోదు అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లోస్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సాత్విక్,డీఎంహెచ్ఓ మనోహర్, ట్రాఫిక్ డియస్ పి ప్రభాకర్ రెడ్డి,జిల్లా రవాణా అధికారి నరేష్,తదితరులు పాల్గొన్నారు.

## 39వ సారి రక్తదానం చేసిన ఆడెపు ఆంజనేయులు




**బీబీనగర్ మండల్ అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల్ కొండమడుగు గ్రామ యువకులు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సర్జనార్ పుట్టినరోజు సందర్భంగా కొత్తగూడెం భద్రాద్రి జిల్లాలో రక్తదాన శిబిరం నిర్వహించిన యంగ్ ఇండియా బ్లడ్ డోనర్స్ క్లబ్ ఫౌండర్ ప్రెసిడెంట్ జేబీ బాలు ఆధ్వర్యంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్ నందు క్యాంపు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కొండమడుగు గ్రామం నుండి చైతన్య కళానిలయం మాజీ అధ్యక్షులు ఆడెపు ఆంజనేయులు స్వచ్ఛందంగా రక్తదానం ఇప్పటికీ 39వ సారి రక్తదానం చేయడం జరిగినది పొడిశెట్టి సాయి తేజ 17వ సారి రక్త దానం చేయడం జరిగినది రక్తదానం మహాదానం అని అంటారు ఆపదలో ఉన్న వారికి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ఇంకా ఎవరికైనా రక్తము ఎంతో అవసరం ఇన్ని సార్లు రక్తదానం చేసినారు అంటే మహా గొప్ప విషయం కొండమడుగు గ్రామ ప్రజలు వారిని ప్రశంసిస్తున్నారు ఇకముందు ఇదేవిధంగా ఎవరికైనా ఆపదలో ఉన్న వారికి మీ సహాయ సహకారాలు ఉండాలని రక్తదానం ఇంకా చేయాలని మీ ఆరోగ్యపరంగా కూడా చాలా జాగ్రత్తగా ఉండి ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలు మీరు ముందుండి ఇంతమందిని కాపాడుతున్నందుకు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కుక్కల దాడిలో 13 గొర్రె పిల్లలు మృతి

**తుర్కపల్లి,అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):**



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తుప్పుడు కనకయ్య మేకల దొడ్డిలోకి కుక్కలు చొరబడి దాడి చేయడంతో 13 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఈ ఘటనతో గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న కనకయ్య తీవ్రంగా నష్టపోయారు. ఒక్కసారిగా 13 గొర్రె పిల్లలు మృతి చెందడంతో బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విచారం కలిగించింది.

## దత్తాయపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**జెమ్ కేర్ ఫాలోమి హాస్పిటల్ వైద్య బృందం**



**తుర్కపల్లి, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద హైదరాబాద్ ఈసీఐఎల్‌కు చెందిన జెమ్ కేర్ ఫాలోమి హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందం శిబిరాన్ని ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ జెరిపోతుల కరుణాకర్, ఉపసర్పంచ్ జిట్ట కిషన్ యాదవ్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎంపి చామలను శాలువాతో సన్మానం

**యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):**



జాతీయా రహదారి ఎన్ హెచ్ 163 హైదరాబాద్ – వరంగల్ హైవే పై పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో కీలక పాత్ర పోషించిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ని కలసి శాలువాతో సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసీసీ ప్రధాన కార్యదర్శులు పొత్నాక్ ప్రమోద్ కుమార్, కసుబ శ్రీనివాస్,నాయకులు మహమ్మద్ అతహర్.ఈ సందర్భంగా ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి వారితో మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ పరిధిలో గల ఎన్ హెచ్ 163 హైదరాబాద్ – వరంగల్ హైవే పై వాహనాల రద్దీ పెరగడం వలన ప్రజలు ఇబ్బందులు ఆయన దృష్టికి రావడంతో రహదారిని 6 లైన్లు గా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రిత్వ శాఖకు, జాతీయ రహదారుల వారికి లేఖలు రాయడం జరిగిందన్నారు. అట్టి ఫలితంగా దాని కొరకు డిపిఆర్ రిపోర్ట్ తయారు చేస్తున్నామని తెలపడం సంతోషకరమని అన్నారు. భువనగిరి బైపాస్ వద్ద కల కేంద్రీయ విద్యాలయం వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణం పనులను కూడా చేపట్టే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని జాతీయ రహదారుల చైర్మన్ తనకు లేఖ ద్వారా తెలపడం జరిగిందని అన్నారు.

## సాంస్కృతిక పర్యాటక అభివృద్ధికి ఎక్స్‌పీరియన్స్ టూర్స్

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఆధ్వర్యంలో ప్రత్యేక పర్యాటక కార్యక్రమాలు**



**యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):**

పోచంపల్లి ఇక్కత్ చేనేత వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, గ్రామీణ సాంస్కృతిక పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆధ్వర్యంలో రూపొందించిన సుస్థిర పర్యాటక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 'పోచంపల్లి ఎక్స్‌పీరియన్స్ టూర్స్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా పోచంపల్లి చేనేత కళలు, సంప్రదాయాలు, గ్రామీణ జీవన విధానాన్ని పర్యాటకులకు పరిచయం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పర్యాటక యాత్రలను నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ 24న హెరిటేజ్ బృందానికి చెందిన సుమారు 30 మంది సభ్యులు పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా సందర్శకులు పోచంపల్లి ఇక్కత్ మ్యూజియాన్ని సందర్శించి, ఇక్కత్ చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియ, వాటి చారిత్రక ప్రాధాన్యత, ప్రత్యేకమైన సాంకేతికతలు, చేనేత కార్మికుల నైపుణ్యాలను తెలుసుకున్నారు. చేనేత కార్మికులతో నేరుగా మాట్లాడి వస్త్ర తయారీలోని వివిధ దశలను పరిశీలించారు. స్థానిక చేనేత దుకాణాలు, గ్రామీణ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడంతో పాటు తెలంగాణ సంప్రదాయ భోజనాన్ని ఆస్వాదించారు. పోచంపల్లి కేవలం ప్రసిద్ధ చేనేత కేంద్రంగానే కాకుండా, వ్యవసాయ ప్రకృతి దృశ్యాలు, స్థానిక సంప్రదాయాలు, హస్తకళలు, గ్రామీణ జీవన విధానంతో కూడిన ప్రత్యేక పర్యాటక ప్రాంతమని ఈ పర్యటన ద్వారా సందర్శకులు తెలుసుకున్నారు. తరతరాలుగా కొనసాగుతున్న పోచంపల్లి ఇక్కత్ చేనేత కళను పరిరక్షించడంలో కార్మికుల కృషి, సహనం, నైపుణ్యాల ప్రాముఖ్యతను వారు గుర్తించారు. ఈ పర్యటనకు స్థానికంగా శిక్షణ పొందిన టూర్ గైడ్లు సాగర్, శ్వేత నాయకత్వం వహించి, పోచంపల్లిలోని చారిత్రక, సాంస్కృతిక విశేషాలను సందర్శకులకు వివరించారు. స్థానిక యువతకు శిక్షణ అందించడం, పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలను పెంపొందించడం, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో పర్యాటక అభివృద్ధిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో భాగంగా నేడు డెక్కన్ అచ్యుస్ బృందం పోచంపల్లిని సందర్శించనుంది. ఈ పర్యటన ద్వారా పోచంపల్లి చేనేత వారసత్వం, సాంస్కృతిక ప్రత్యేకతలు, స్థానిక జీవన విధానాన్ని మరింత మంది పర్యాటకులకు పరిచయం చేయనున్నారు. పోచంపల్లి ఇక్కత్ చేనేత కళకు మరింత గుర్తింపు తీసుకురావడం, పర్యాటకుల సంఖ్యను పెంచడం, చేనేత కార్మికులు, స్థానిక ప్రజలకు అదనపు ఉపాధి అవకాశాలను కల్పించడం, పోచంపల్లిని సుస్థిర సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యాలని అధికారులు తెలిపారు.

## అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

**బిజెపి మండల పార్టీ అధ్యక్షులు నునుబోతు సైదులు**



**అడ్డగూడూరు, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య) :**

ఖమ్మం, వరంగల్, నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికలలో మండలంలోని అర్హులైన పట్టబద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని మండల బిజెపి పార్టీ అధ్యక్షులు నునుబోతు సైదులు పత్రికా ప్రకటనలో తెలిపారు. 2023 నవంబర్ 1 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా డిప్లమా పూర్తి చేసి, కనీసం మూడేళ్లు పూర్తయిన వారు పట్టబద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. హరత కలిగిన వారు అవసరమైన ధ్రువపత్రాలతో ఫారం–18 ద్వారా నవంబర్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించి వివరాలను సమర్పించాలని కోరారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి, వారి హక్కుల కోసం పోరాడే ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి అర్హుడూ ఓటర్ జాబితాలో తమ పేరు నమోదు చేసుకొని ప్రజాస్వామ్య హక్కైన ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులు పెద్ద సంఖ్యలో నమోదు ప్రక్రియలో పాల్గొని ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన కోరారు.

## రామన్నపేటలో విరాళాల సేకరణ ప్రారంభం

**రామన్నపేట, అక్టోబర్ 24( వార్త వేదిక సూర్య):**

నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండలో జరగనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ మహాసభల సందర్భంగా రామన్నపేట పట్టణ కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జల్లెల పెంటయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట పురిటిగడ్డ నల్లగొండలో జరిగే జాతీయ మహాసభలకు దేశవ్యాప్తంగా సుమారు 1,500 మంది రైతు ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు.దేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి, భవిష్యత్తు రైతాంగ ఉద్యమ కార్యాచరణను రూపొందించడానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని అనునిత్యం మోసం చేస్తున్నాయని విమర్శించారు. భూసేకరణకు 2013 చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం అందించాలని రైతుల పక్షాన పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే పండ్లు, కూరగాయలు, పత్తి, మిర్చి తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని, వ్యవసాయానికి సబ్సిడీలు పెంచాలని, రైతులను రుణ విముక్తులను చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకొని రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు.దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి నిర్వహిస్తున్న ఏఐకేఎస్ జాతీయ మహాసభలకు రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో విరాళాలు అందించి, పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని జల్లెల పెంటయ్య విజ్ఞప్తి చేశారు. సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గౌరిగే సోములు,బావండ్లపల్లి బాలరాజు, నాయకులు పల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఏఐకేఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



# నీటి సంరక్షణపై విద్యార్థుల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన



**9వ తరగతి విద్యార్థులతో వర్షపు నీటి సంరక్షణపై ప్రాజెక్ట్ వర్క్**

**యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో సంభవించే మార్పులను దృష్టిలో ఉంచుకుని, నీటి సంరక్షణపై ముందస్తు సన్నద్ధతలో భాగంగా పాఠశాల విద్యార్థుల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 9వ తరగతి విద్యార్థులకు వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, భూగర్భ జలాల పెంపు ప్రాముఖ్యతపై ప్రాజెక్ట్ వర్క్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ గ్రామాల్లో ఇప్పటికే ఉన్న వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను పరిశీలించి, వాటి పనితీరును తెలుసుకోవడంతో పాటు మరమ్మతులు అవసరమైన నిర్మాణాలను గుర్తించడం, కొత్తగా నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాల్సిన ప్రాంతాలను పరిశీలించడం వంటి అంశాలపై అధ్యయనం చేస్తారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు, నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్ ద్వారా నేర్చుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులకు, గ్రామ ప్రజలకు వివరించడం ద్వారా గ్రామస్థాయిలో నీటి సంరక్షణపై విస్తృత అవగాహన కల్పించవచ్చని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ప్రతి ప్రాంతంలోనూ వర్షపాతం తప్పనిసరిగా తగ్గుతుందని చెప్పలేమని, అయితే వర్షపు నీటిని సాధ్యమైనంత మేర ఒడిసిపట్టడం, ఇంకుడు గుంతలను సక్రమంగా నిర్వహించడం, భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. నీటి భద్రత కోసం జిల్లా యంత్రాంగం చేపడుతున్న ఈ ముందస్తు కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు భాగస్వాములై ప్రతి వర్షపు నీటి బొట్టును సంరక్షించే దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## దళిత బంధు నిధులను విడుదల చేయాలని
# అంబేద్కర్ విగ్రహానికి వినతి



**మోత్కూరు, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):**

దళితుల అభివృద్ధి సంక్షేమానికై గత బిఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టిందని దళిత బంధు సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ బుశిపాక గణేష్ మాదిగ అన్నారు. దళిత బంధు నిధులను గత 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు విడుదల చేసి ఎన్నిక కోడ్ రాగానే కలెక్టర్ ఖాతాలో ఫ్రీజింగ్ పెట్టారని,ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధు పథకంలో మొదటి విడతలో ప్రతి లబ్ధిదారులకి బ్యాంకు ఖాతాలో పది లక్షల రూపాయలు జమ చేసిందని, రెండో విడతలో భాగంగా మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు సంబంధించిన 254 మంది లబ్దిదారులకు బ్యాంకు ఖాతాలలో 3 లక్షల రూపాయలు జమ చేసిందన్నారు. ఈ నిధుల విడుదలకు అసెంబ్లీ ఎన్నికలు కోడ్ రావడంతో కలెక్టర్ ఖాతాలో మాకు రావాల్సిన నిధులు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి రాష్ట్ర గౌరవ సలహాదారులు కొంపల్లి అంజయ్య, మండల నాయకులు బండి వెంకటేష్, చుక్క అశోక్, బందెల శ్రీను, బద్దుల చిట్టిబాబు, కొంపల్లి రమేష్ గంటెపాక రాంమల్లు తదితరులు పాల్గొన్నారు.10

# 45వ సారి రక్తదానం చేసిన నవీన్



**మోత్కూరు, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):**

హైదరాబాద్‌లోని సైబరాబాద్ కమీషనర్ సజ్జనార్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్ క్లబ్ ఆధ్వర్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కురిమేటి నవీన్ 45 సారి చిరంజీవి బ్లడ్ బ్యాంక్ కు రక్తదానం చేశారు.ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తం అవసరమైన వారికి అండగా నిలుస్తూ, ప్రాణాలను కాపాడటమే తమ సంస్థ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.18 సంవత్సరాలు దాటి 50 కిలోలు ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకొని, ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.. మాతృదేవోభవ, పితృదేవోభవ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేశానని ,తన సేవలను గుర్తించి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సినీ దర్శకులు మోహర్ రమేష్ అభినందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాతృదేవో పితృదేవో భవ సభ్యులు ఎండి, అహ్మద్,నర్సింహ్మా, మహేష్ పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం
## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**ఆలేరు, అక్టోబర్ 24(వార్త వేదిక సూర్య):**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆలేరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విజేతలకు పరీక్ష ప్యాడ్లు, పాల్గొన్న విద్యార్థులందరికీ పెన్నులు అందజేశారు. విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలేరు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ తెలిపారు.

# 15 లక్షలున్నాం... విస్మరిస్తే ఊరుకోం!

**నేడు విశ్వకర్మ పొలిటికల్ సమ్మిట్**




**హైదరాబాద్ బ్యూరో, అక్టోబరు 24 (వార్త వేదిక సూర్య):**

విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో విశ్వకర్మ పొలిటికల్ సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నాడు జరగనుంది. సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ హైదరాబాద్‌లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగే ఈ పొలిటికల్ సమ్మిట్‌లో అన్ని రాజకీయ పార్టీలలో ఉన్న విశ్వకర్మ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ దేవరకొండ కాళిదాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో విశ్వకర్మ /విశ్వబ్రాహ్మణుల జనాభా సుమారు 15లక్షల వరకు ఉంటుంది. కేవలం 2 శాతం ఓట్ల తేడాతో ప్రభుత్వాలు ఏర్పడుతున్న తరుణంలో... 4 నుంచి 5 శాతం ఓటు బ్యాంకుతో ఎన్నికలను నిర్దేశించే స్థాయిలో విశ్వకర్మలు ఉన్నారన్నారు. అయిదు వృత్తులతోపాటుగా అన్ని రంగాల్లోనూ విశ్వకర్మలు ప్రముఖంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రొఫెసర్ జయశంకర్ సార్, ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి, సామాజిక ఉద్యమ నేత మారోజు వీరన్నల స్ఫూర్తిగా విశ్వకర్మ పొలిటికల్ సమ్మిట్ జరగనుందని జేఏసీ కో-కన్వీనర్ అడ్లూరి రవీంద్రా చారి తెలిపారు. మేధావి వర్గంగా పరిగణించే విశ్వకర్మలు ఇప్పటికే అన్ని ప్రధాన రాజకీయ పార్టీలలోనూ, చాలా మంది కీలక నాయకుల వద్ద క్రియాశీలక పాత్రను పోషిస్తూ... ప్రత్యక్ష రాజకీయాల వైపు విశ్వకర్మ భావితరాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పొలిటికల సమ్మిట్ దిశానిర్దేశం చేయనుంది. కాంగ్రెస్, విపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కమ్యూనిస్టులు, ఇతర పార్టీలు బీసీ కులాలలో జనాభా పరంగా మొదటి అయిదారు స్థానా లలో నిలిచే విశ్వకర్మ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని సమ్మిట్ వేదిక నుంచి కోరనుంది.

# స్వర్ణగిరిలో ఘనంగా మూడో రోజు పవిత్రోత్సవాలు

**పవిత్రోత్సవాలలో చతుర స్థానార్చన అగ్ని ప్రతిష్ట.**

**కల్పవృక్ష వాహనంపై దర్శనమిచ్చిన స్వర్ణగిరీషుడు.**

**చంద ప్రభ వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు.**



**యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రాముఖ్య వైష్ణవ పుణ్య క్షేత్రముగా విరాజిల్లుతున్న యాదాద్రి తిరుమల దేవ స్థానం స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవ స్థానంలో శనివారం మూడో రోజు ఘనంగా ప్రారంభమైన పవిహ త్రోత్స వాలు..పవిత్రోత్సవాల మూడో రోజు శనివారం ఉదయం చతుస్థానార్చన కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాశ్వతకంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని లక్ష్మీ మండపంలో ఏర్పాటు చేసిన జాగస్థాలలో అగ్ని ప్రతిష్ట కార్యక్రమాన్ని వేద మంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించారు. వైదిక క్రతువులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతా వరణముతో నిండిపోయింది. పవిత్రోత్సవాల్లో భక్తులు పాల్గొని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య అనుగ్రహాన్ని పొందారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మూడవ రోజు సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారు కల్పవృక్ష వాహనం పై కొలువు దీరి భక్తులకు దివ్య మంగళ రూపాన్ని దర్శన మిచ్చారు. కల్పవృక్ష వాహన సేవలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు గోవింద నామ స్మరణతో మానేపల్లి హిల్స్ స్వర్ణగిరి క్షేత్రాన్ని మార్మోగించారు. కల్పవృక్ష వాహనం పై విరాజిల్లిన శ్రీవారి దివ్య రూపం భక్తులకు కనుల పండువగా నిలిచి పోయింది. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారు చంద్ర ప్రభ వాహనం పైన ఆలయ మాడవీధులలో తిరుగుతూ భక్తులకు స్వామివారి దివ్య స్వ రూపాన్ని ప్రసాదించారు. స్వామి వారి దివ్య మంగళ స్వరూపాన్ని చూసి భక్తులు ఆనంద పరవశులయినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం

**- పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి –**

**జిల్లా కలెక్టర్లకు సీఎస్ ఆదేశం**



**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):**

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు గోల్డెన్ అవర్‌లో తక్షణ వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పీఎం రాహత్ పథకం కింద అర్హులైన బాధితులకు రూ.1.50 లక్షల వరకు చికిత్స ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి ఆయన పథకం అమలుపై సమీక్షించారు. ప్రమాద బాధితులకు సమీపంలోని ప్రభుత్వ, పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో తక్షణ వైద్యం అందించాలని సూచించారు. జిల్లాల్లోని అన్ని అర్హత కలిగిన ఆసుపత్రులు సంబంధిత పోర్టల్‌లో నమోదు కావాలని, ప్రమాద వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం చేయకూడదని ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలోని ఆసుపత్రుల నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సేవలు, పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సాత్విక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్, ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి నరేష్ పాల్గొన్నారు.




# నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన



**మోత్కూరు, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):**

ఎల్నిఓ ప్రభావం వల్ల రానున్న రోజుల్లో నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్రజలు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ గోలుకొండ నర్సయ్య సూచించారు.శనివారం మోత్కూరు మున్సిపల్ పరిధిలోని 3,4,5, 10, 11, 12 వార్డులలో వార్డు సభలను నిర్వహించి,ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంరక్షణకు అవసరమైనప్పుడు మాత్రమే నీటిని ఉపయోగించుకోవాలని, భవిష్యత్ అవసరాల అదృష్ట నీటిని ఆదా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న గుప్తా, కౌన్సిలర్లు కొండ శోభ, మొగుళ్ళ అనురాధ, మెంట రమణ ఆయా వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కేత్ బచావో అభియాన్ కార్యక్రమం



**మోత్కూరు, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):**

మండలంలోని అనాజీపురం గ్రామంలో కేత్ బచావో, అభియాన్ ( "సాగు భూమి సంరక్షణ") అనే అంశంపై శనివారం మండల వ్యవసాయ శాఖ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి వడ్డేమాన్ కీర్తి మాట్లాడుతూ రైతులకు నేల ఆరోగ్యం, పంట మార్పిడి,పకృతి వ్యవసాయం, సమతుల్య ఎరువుల వినియోగం, పంట అవశేషాల నిర్వహణ,నీటి సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ నాయక్, ఎంపీవో రఫూఫ్ అలీ, విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బీసు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కులపై అవగాహన సదస్సు



**మోత్కూరు, అక్టోబర్ 24 ( వార్త వేదిక సూర్య)**

నేటి విద్యార్థులే రేపటి దేశానికి తల్లిదండ్రులకు నిజమైన సంపద అని రామన్నపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య అన్నారు. శనివారం మోత్కూరు మున్సిపల్ పరిధిలోని బుజిలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ కమిటీ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు బడిలో ఉన్నప్పుడే వారి హక్కులు రక్షించబడతాయని , వారి తల్లిదండ్రులు విద్యార్థులను గుర్తించినప్పుడే భవిష్యత్ ఉన్నత స్థాయికి వెళ్తారని పేర్కొన్నారు. అనంతరం ప్యానల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, డ్రగ్స్, గంజాయి, పోక్సో, రవాణా చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చినా 1098,108,112,100 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సదస్సుకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తంగళ్ళపల్లి సత్యనారాయణ అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యులు కానుగంటి శ్రీశైలం, లీగల్ సర్వీస్ మండల ప్రతినిధి కురిమేటి యాదయ్య, స్థానిక కౌన్సిలర్ మొగుళ్ళ అనురాధ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే ఉమేష్ చంద్ర, ఏ ఏ పీసీ చైర్ పర్సన్ చుక్క విజయ పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పరామర్శ



**ఆలేరు, అక్టోబర్ 24(వార్త వేదిక సూర్య):**

ఆలేరు మండలం కొలూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన చీకట్ల అంజయ్య కుటుంబాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి పరామర్శించి, 50 కిలోల బియ్యం అందించారు. కాంగ్రెస్ నాయకుడు పార్నంది భాస్కర్ రూ.3 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ గాజుల దశరథ, ఆలేరు వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్ యాదవ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# నల్లగొండ

## గోదావరి జలాలు అందిస్తేనే భూములు ఇస్తాం



మోత్కూరు అక్టోబర్ 24 ( వార్త వేదిక సూర్య):

బునాదిగాని కాల్వ ద్వారా గోదావరి జలాలు అందిస్తామంటేనే తమ భూములు కాల్వ కోసం ఇస్తామని, లేదా భూములకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఎకరానికి కోటి నుండి కోటిన్నర పరిహారం ఇస్తేనే భూములు ఇస్తామని మండలంలోని పాటిమట్ల, దాచారం రెవెన్యూ గ్రామాల రైతులు తెలిపారు శనివారం పాటిమట్ల గ్రామంలో భూముల కోసం రైతులకు చెక్కులు ఇవ్వడానికి వచ్చిన ల్యాండ్ ఆక్విజేషన్ అదనపు కలెక్టర్ జగన్నాధ రావు, అధికారులను ఆయా గ్రామాల రైతులు అడ్డుకున్నారు. తమ సమస్యలపై అదనపు కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. తమ తాతల నుంచి భూములు సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. బునాది గాని కాల్వ ద్వారా మూసి నీరు అందిస్తామంటే భూములు ఇవ్వమని, గోదావరి జలాలు అందిస్తామంటేనే భూములు అప్పగిస్తామన్నారు. తమకు న్యాయం జరగని యెడల రైతులతో కలిసి గోదావరి జలాల సాధన కోసం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. పాటిమట్ల, దాచారం రెవెన్యూ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలి



మోత్కూరు, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య);

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో గ్రామ శాఖ అధ్యక్షులు నిరంతరం కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని వివిధ గ్రామ శాఖ అధ్యక్షులను నియమించారు. పాలడుగు కొసన ఉప్పలయ్య, పాటిమట్ల కురిమేటి విక్రమ్, రాగిబావి గంట వెంకట్ రెడ్డి, అనాజిపురం బర్రె వెంకన్నలను గ్రామ శాఖ అధ్యక్షులను నియమించినట్లు బాలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు అబద్ధం నాగార్జున రెడ్డి, జిల్లా నాయకులు బొడ్డుపల్లి కళ్యాణి చక్రవర్తి, గద్దం సోమ నర్సయ్య, సర్పంచులు అంతటి భగవంత్, బండ రమ, బీసు వెంకటయ్య మండల నాయకులు ఎడ్ల భగవంత్, ముక్కెర్ల మహేష్ పాల్గొన్నారు.

## ఫోక్సో కేసుల పరిష్కారంలో జాప్యం చేయకూడదు

**డిసెంబర్ 12వ తేదీన జరిగే జాతీయ లోక్ పదాలత్తులో కేసుల పరిష్కారానికి పోలీస్ యంత్రాంగం కృషి చేయాలి**



యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి స్పెషల్ జడ్జి, ఇంచార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మిలింద్ కాంబ్లె జిల్లా కోర్టు భవనములో పొక్సో కేసులు, బాధితుల సంరక్షణ, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ నిర్వహణ అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశములో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత, జువెనైల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి స్వాతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు బండారు జయశ్రీ, ప్రత్యేక పి పి జి. రవీందర్ రెడ్డి, భువనగిరి రూరల్ సి ఐ. చంద్రబాబు, యాదగిరిగుట్ట సి. ఐ భాస్కర్, ఎస్. ఐ. రవి, భరోస కేంద్రం ఇన్స్పెక్టర్ మరియు కౌన్సిల్, లైసన్ ఆఫీసర్స్ శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు. పొక్సో కేసుల పరిష్కారములో జాప్యం లేకుండా తీసుకోవాల్సిన చర్యలు , బాధితుల పరిహారం, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ పై తగిన సూచనలను అధికారులకు ఇచ్చారు. డిసెంబర్ 12వ తేదిన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసుల పరిష్కారానికి పోలీసు యంత్రాంగం కృషి చేయాలని తెలిపారు.

## మెరుగైన చికిత్స అందించాలి: ఎమ్మెల్యే కుంభం



వలిగొండ, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సుంకిశాల దగ్గర ఉన్నటువంటి గ్యాస్ లైన్ వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో సుంకిశాల గ్రామానికి చెందిన చెరుకు ప్రశాంత గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రశాంత్ గౌడ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, నాణ్యమైన చికిత్సను అందించాలని హాస్పిటల్ సిబ్బందికి తెలియజేశారు.

# రైతులకు భరోసా కల్పించాలి..

**రాజకీయ విమర్శలు తగవు**

**రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యం**

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**




భువనగిరి టౌన్ అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

ఎల్‌నినో ప్రభావాలతో రైతులకు ఎదురయ్యే సమస్యలపై భరోసా కల్పించాల్సిన ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్.. అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలకే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. రైతుల సమస్యలపై నిర్మాణాత్మక సూచనలు చేయకుండా ప్రభుత్వంపై నిందలు వేయడం వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావం, రైతులకు అందించాల్సిన సూచనలపై ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావాల వల్ల రైతులకు, వ్యవసాయ రంగానికి నష్టం కలగకుండా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించడం, రైతులకు అవసరమైన వ్యవసాయ సూచనలు అందించడం, సాగునీరు, తాగునీటి లభ్యతను పర్యవేక్షించడం వంటి చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. అలాగే నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు ముందస్తు చర్యలు కీలకమని పేర్కొన్నారు. రైతులకు ఏం చేయాలో సూచనలు ఇవ్వకుండా, వారికి భరోసా కల్పించకుండా ప్రభుత్వంపై నిందలు వేయడం ద్వారా బీఆర్ఎస్ సాధించేదేమిటని కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపక్షం నిర్మాణాత్మక సూచనలు చేయాలని, రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# ఎండుతున్న వరి పంటలు

**- నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి**

**- సీపీఎం నేత గడ్డం వెంకటేష్**



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

మండలంలో ఎండిపోతున్న వరి పంటలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గడ్డం వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం పెద్దకందుకూరులో నష్టపోయిన రైతుల వరి పంటలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావం, సాగునీటి కొరతతో బోర్లు పనిచేయక, కాలువల ద్వారా నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చొల్లేరు, చిన్నకందుకూరు, మర్రిగూడెం గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభు త్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని కోరారు.

**ఎమ్మెల్యే హామీ నిలబెట్టుకోవాలి**

రైతులకు సాగునీరు అందిస్తానని గతంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను పరిశీలించి, రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోతే తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాలతో పాటు ఎమ్మెల్యే ఇంటి ఎదుట రైతులతో కలిసి ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కాలే స్వా మి, జోగు శ్రీనివాస్, పత్తి నరసింహ, జాగిల్లాపురం బాలనరసింహ, జాగిల్లాపురం అశోక్, పాండు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణగిరిలో వైభవంగా పవిత్రోత్సవాలు..

**శాస్త్రోక్తంగా చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ఠ**

**స్వామివారిని కల్పవృక్ష వాహనంపై దర్శించుకున్న భక్తులు**



భువనగిరి అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

భువనగిరి స్వర్ణగిరి ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం ఉదయం చతుస్థానార్చన కార్యక్రమాన్ని అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని లక్ష్మీ మండపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో వేద మంత్రోచ్చారణల నడుమ అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. ఉదయం వేద పారాయణం, దివ్య ప్రబంధ పారాయణంతో ప్రారంభమైన వైదిక కార్యక్రమాలు ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయి. వేదమంత్రాల నడుమ నిర్వహించిన పూజా క్రతువుల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారి దివ్య అనుగ్రహాన్ని పొందారు. అదేవిధంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చి వైభవంగా వాహన సేవ నిర్వహించారు. స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు గోవింద నామస్మరణతో భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. దీంతో ఆలయ ప్రాంగణం గోవింద నామసంకీర్తనలతో మార్మోగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీ మానేపల్లి రామారావు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, వైదిక క్రతువులతో స్వర్ణగిరి క్షేత్రం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## ఎల్‌నినోపై అవగాహన సదస్సు



బొమ్మలరామారం, అక్టోబర్ 24 వార్త వేదిక సూర్య

బొమ్మలరామారం మండలంలోని జడ్పీహెచ్ఎస్ జలాల్‌పూర్ పాఠశాలలో ఎల్‌నినో పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరికొండ శ్రీనివాస్ రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సోషల్ టీచర్ పద్మావతి విద్యార్థులకు ఎల్‌నినో గురించి అవగాహన కల్పించారు. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో ఏర్పడే మార్పులకు సంబంధించిన సహజ వాతావరణ దృగ్విషయమని వివరించారు. దీని ప్రభావంతో ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతలు, కరువులు, వరదలు వంటి వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించవచ్చని తెలియజేశారు. ఎల్‌నినో ప్రభావం వ్యవసాయం, నీటి వనరులు, పర్యావరణంపై చూపే ప్రభావాల గురించి విద్యార్థులకు వివరించారు. వాతావరణ మార్పులపై అవగాహన కలిగి ఉండాలని, ప్రకృతి వనరులను సంరక్షించాలని ఈ సందర్భంగా సూచించారు.ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, స్వామి, మంజుల, శ్రీశైలం, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## జర్నలిస్టు శ్రీనివాస్‌కు టీజేఏ నేతల పరామర్శ



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

అనారోగ్యానికి గురైన భువనగిరికి చెందిన నిజం రిపోర్టర్, టీజేఏ జిల్లా ఉపాధ్యక్షుడు గట్టికొప్పుల శ్రీనివాస్‌ను టీజేఏ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షానూర్ బాబా శనివారం ఆయన నివాసంలో పరామర్శించారు. శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, సంఘం సభ్యుడు బలరాం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కల్లూరు మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు మాయ కృష్ణ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన సీఐటీయూ నాయకులు ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. దాదాపు 20 ఏళ్లుగా వైద్య సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రతతో పాటు ప్రసూతి సెలవులు వంటి సౌకర్యాలు కల్పించకపోవడం దురదృష్టకరమని మల్లేశం అన్నారు. కనీస వేతనాలు అమలు చేయకపోవడం, వేతనాల చెల్లింపుల్లో సమస్యలతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన క్రమబద్ధీకరణ హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల పోరాటానికి సీఐటీయూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎన్‌హెచ్ఎం జేఏసీ అధ్యక్షుడు షాహిద్, డాక్టర్లు ప్రశాంత్, మధు, కవిత, శ్రీదేవి, రజిత తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



భువనగిర అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):

భువనగిరి పట్టణంలో రామ్‌నగర్‌లో 9, 22వ వార్డులకు చెందిన లబ్ధిదారులకు కౌన్సిలర్లు జాలిగం విఘ్నేష్, బొంతల నర్సింగరావు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. స్థానిక రేషన్ దుకాణం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన పేద ప్రజలు ఎప్పుడైనా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు ప్రణయ్, జావేద్‌తో పాటు ఆయా వార్డులకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

## బందారపు అంజయ్య మృతి సిపిఐ కి తీరని లోటు

**- యానాల దామోదర్ రెడ్డి**

వలిగొండ:అక్టోబర్24 ( వార్తా వేదిక సూర్య )



వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ అంజయ్య అకాల మరణం చెందారు. యాదాద్రి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ఆయన పార్థివ దేహం పై ఎర్రజెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ అంజయ్య పేద కుటుంబంలో పుట్టినప్పటికీ భారత కమ్యూనిస్టు పార్టీ –సిపిఐ సిద్ధాంతాలకు ఆకర్షితులై పులి పలుపుల రామ లక్ష్మయ్య, ఖాజా మైనుద్దీన్, నీలం చెన్న య్యతో కలసి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. పదవుల కోసం ఆశపడకుండా పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేసినారు అతని మృతి కుటుంబానికి భారత కమ్యూనిస్టు పార్టీకి ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని అన్నారు. రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరా ములు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, శాఖ కార్యదర్శి పులిపలుపుల మల్లే శం, అంబటి అంజయ్య, తాలూకా యాద య్య, గుండె గాని అంజయ్య, ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి గుండె గాని నాగరాజు, పైల యాదయ్య, పాల్గొన్నారు.

## చేరిపల్లి కైలాసం మృతి బాధాకరం

### దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):** కొండమల్లెపల్లి మాజీ ఎంపీటీసీ చేరిపల్లి కైలాసం మృతి బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శనివారం కొండమల్లెపల్లిలో చేరిపల్లి కైలాసం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, కైలాసం మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కైలాసం ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కేసాని లింగారెడ్డి, సర్పంచ్ రమావత్ తులసీరామ్, అందుగుల వెంకటేష్, బోడ అశోక్, తోటపల్లి వెంకటయ్య, తోటపల్లి వెంకటేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## వరికుప్పల పాండుకు మాజీ ఎమ్మెల్యే పరామార్శ



**దేవరకొండ,అక్టోబర్ 24(వార్తా వేదిక సూర్య):** కొండమల్లెపల్లి మాజీ వార్డు సభ్యులు వరికుప్పల పాండు ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందారు. ప్రస్తుతం ఆయన తన నివాసంలో విశ్రాంతి తీసు కుంటున్నారు.ఈ నేపథ్యంలో శనివారం కొండమల్లెపల్లి పట్టణంలోని వరికుప్పల పాండు నివాసానికి దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా పాండు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం కొనసాగించాలని రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కేసాని లింగారెడ్డి, సర్పంచ్ రమావత్ తులసీరామ్, బషీర్, అందుగుల వెంకటేష్, బోడ అశోక్, తోటపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య)** ఉమ్మడి నల్లగొండ జిల్లా జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు ఈనెల 26న సోమవారం ఉదయం 10 గంటలకు నల్లగొండ లోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు.01-01-2007 నుంచి 31-12-2010 మధ్య జన్మించిన బాలికలు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారులు సెలక్షన్స్‌కు హాజరయ్యేటప్పుడు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.

## డాక్టర్ సీటు సాధించిన పేదింటి బిడ్డ

### నార్కట్‌పల్లి కామినేని మెడికల్ కాలేజీలో వైద్య విద్యకు ఎంపిక



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య)** నిరుపేద కుటుంబంలో జన్మించినా పట్టుదలతో చదివి వైద్య విద్యకు ఎంపికై కట్ట అనువర్ధిక అందరికీ ఆదర్శంగా నిలిచింది. నార్కట్‌పల్లి మండలం తొండ్లాయి గ్రామానికి చెందిన కట్ట లక్ష్మణ్, ప్రసన్న రాణి దంపతుల కుమార్తె అనువర్ధిక నార్కట్‌పల్లి కామినేని మెడికల్ కాలేజీలో వైద్య విద్య అభ్యసించే అవకాశం సాధించింది. అనువర్ధిక ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుంటూ ఇంటర్మీడియట్‌లో 950 మార్కులు సాధించింది. వైద్య విద్యలో సీటు సాధించాలనే లక్ష్యంతో మూడేళ్ల పాటు కష్టపడి చదివి తన కలను సాకారం చేసుకుంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివినా కష్టపడి ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని ఆమె నిరూపించింది.అనువర్ధిక విజయంతో తల్లిదండ్రులు, తాతయ్య రాములు, అమ్మమ్మ సుజనతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను అభినందించారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య)** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండలో జరిగిన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మిక చట్టాల సవరణ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 31న ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎన్. రామస్వామి అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్. రెడ్డి, పలువురు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# భూతరాజు రామయ్య 45వ వర్ధంతి వేడుకలు

### ఆసుపత్రి నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని దానం

### చేసిన మహానీయుని సేవలు చిరస్మరణీయం



**చండూరు, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య ):** సమాజహితం కోసం ప్రాణత్యాగం చేయడమే కాకుండా, తనకున్న విలువైన ఆస్తులను ప్రజాప్రయోజనాల కోసం దారాదత్తం చేసిన మహనీయుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, అటువంటి కోవకే చెందిన గొప్ప మానవతావాది శ్రీ భూతరాజు రామయ్య అని వక్తలు కొనియాడారు. చండూరు ప్రాంత ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అప్పట్లోనే ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రెండు ఎకరాల విశాలమైన భూమిని దానం చేసి ఆదర్శప్రాయంగా నిలిచిన దాత, మహనీయులు శ్రీ భూతరాజు రామయ్య 45వ వర్ధంతి వేడుకలు శనివారం చండూరులో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రామయ్య కుటుంబ సభ్యులు, స్థానికులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. నాటి ఆయన దాతృత్వాన్ని, విశిష్ట సేవలను స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. నాటి త్యాగమే నేడు ప్రజలకు శ్రీరామ రక్ష..ఈ కార్యక్రమంలో చండూరు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మాసరాజు ముఖ్య అతిథిగా పాల్గొని రామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూతరాజు రామయ్య నాటిన దాతృత్వపు బీజం నేడు వృక్షమై వేలాది మందికి ప్రాణాలు రక్షిస్తోందని ప్రశంసించారు. రామయ్య దానం చేసిన ఆ రెండు ఎకరాల స్థలంలో రూపుదిద్దుకున్న ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా నేటికీ చండూరు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ఆసుపత్రికి ఆయన చేసిన త్యాగమే మూల స్తంభంగా నిలిచిందని కొనియాడారు. ఆసుపత్రి సిబ్బంది కూడా రామయ్య సేవా భావాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఘనంగా నివాళులర్పించిన ప్రముఖులు..ఈ శ్రద్ధాంజలి కార్యక్రమంలో భూతరాజు రామయ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రముఖులు పెద్దఎత్తున తరలివచ్చి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో..భూతరాజు వెంకటేశం, యాదయ్య నారాయణ,భూతరాజు స్రవంతి రమేష్ ,మురళి, వేణు,రామకృష్ణ మణికంఠ, భూతరాజు హేహన్ష్, పగిళ్ళ స్రవంతి, రేవల్లి వెంకటేష్, కొమ్మనపల్లి దశరథ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాంతరం రామయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని, ఆయన చేసిన త్యాగాన్ని భవిష్యత్ తరాలకు గుర్తుచేస్తూనే ఉంటామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.35

## కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలి

### అక్టోబర్ 26 న చలో హైదరాబాద్



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య)** కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి వల్లపుదాసు భూలక్ష్మి , సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం డిమాండ్ చేశారు. ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో యూనియన్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కాంట్రాక్టు ఏజెన్సీలను రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.అనంతరం 19 మందితో జీజీహెచ్ యూనిట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దండెంపల్లి సత్తయ్య, అధ్యక్షుడిగా మునగ వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా అవుట రవీందర్, వర్కింగ్ సెక్రటరీగా బోడ జానకి, కోశాధికారిగా కట్ట ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్కపాక రాజు, గంజి రాజేష్, లలిత, అండాలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుంది

### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య)** పోలీసు అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 1994లో నక్సలైట్ల దాడిలో అమరుడైన ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు వెలకట్టలేనివని ఎస్పీ పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో విధి నిర్వహణలో 15 మంది పోలీసు సిబ్బంది అమరులయ్యారని గుర్తుచేశారు. అమరవీరుల కుటుంబాలు ఎదుర్కొనే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, ఎస్‌బీ సీఐ నాగరాజు, టూటౌన్ సీఐ ఆదిరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ సంతోష్, టూటౌన్ ఎస్ఐ సైదాబాబు పాల్గొన్నారు.

# అమరవీరుల స్ఫూర్తితో రక్తదాన శిబిరం

### రక్తదానం ప్రాణదానంతో సమానం

### ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య)** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ శరత్ చంద్ర పవార్ శనివారం ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర సమయాల్లో రక్తం అందించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని ఆయన అన్నారు. దేశం, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత సామాజిక బాధ్యతగా భావించి స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.రక్తదానానికి ముందుకొచ్చిన అమ్మ ఫౌండేషన్ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, యువతను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఎస్‌బీ డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి, సీఐలు ఆదిరెడ్డి, నాగరాజు, శ్రీను నాయక్, మంజుల, ఆర్ఐలు సంతోష్, సూరపు నాయుడు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కరెంటు కోతలతో పంటలు ఎండిపోతున్నాయి

**దేవరకొండ అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య):** రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం కాలిపోయిన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి విద్యుత్ కోతలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగునీరు అందక పంటలు ఎండిపోతు న్నాయని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శనివారం పీఏపల్లి మండలం అంగడిపేట సబ్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కోతలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, రైతులు చేపట్టిన ముట్టడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడిన నల్గొండ జిల్లాలో రైతులు విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వడంతో వలస వెళ్లిన అనేక మంది తిరిగి వచ్చి సాగు చేసుకున్నారని, ప్రస్తుతం విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోయి రైతులు మళ్లీ వలసలు వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శించారు. విద్యుత్ కోతలతో కాలువల్లో నీరు ఉన్నప్పటికీ పొలాల్లోని మడులకు సాగునీరు అందడం లేదని పేర్కొన్నారు. వరి సాగు కోసం రైతులు ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి అప్పులు చేశారని, సరైన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఎండిపోయిన పంటలను ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొరత కారణంగా రైతులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోందని రవీంద్ర కుమార్ ఆరోపించారు. నకిలీ డీఏపీ ఎరువుల సరఫరాపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు 7,000 మెగావాట్ల స్థాయి నుంచి 20,000 మెగావాట్లకు పైగా పెంచామని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. భద్రాద్రి, యాదాద్రి వంటి విద్యుత్ ప్రాజెక్టులను రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఎందుకు ఏర్పడుతున్నాయి బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ఎందుకు జరగడం లేదు అనే ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జూరాల పరిధిలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ నల్గొండ జిల్లా రైతులకు సాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు.



# నల్లగొండ

## యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుపై అవినీతి ఆరోపణలు తగవు

### బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగార్జున ముదిరాజ్



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య)** యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవినీతి ఆరోపణలు చేయడం తగదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ అన్నారు. నల్లగొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దామరచర్లలో 4 వేల మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి బీఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. కేసీఆర్, జగదీశ్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని, లేనిపక్షంలో సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు నోముల శంకర్ యాదవ్, క్రాంతి కుమార్, కాడింగు శ్రీకాంత్, గౌతమ్ కుమార్, వెంకట్, లోకేష్, మనోజ్ పాల్గొన్నారు.

## లక్ష్మీ సెహగల్ ఆశయాల సాధనకు ఉద్యమించాలి

### ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):** మహిళా హక్కులు, సమానత్వం కోసం కెప్టెన్ లక్ష్మీ సెహగల్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. ఆమె జయంతి సందర్భంగా శనివారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీ సెహగల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న లక్ష్మీ సెహగల్ మహిళల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. మహిళలపై వివక్ష, హింసను అరికట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, మహిళలకు సమాన హక్కులు కల్పించాలని కోరారు. మహిళలు సంఘటితమై హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఐద్వా నాయకులు కొండా అనురాధ, తుమ్మల పద్మ, బొల్లాపల్లి మంజుల, పుష్పలత పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

### సీఐటీయూ నాయకులు సలీం, లకపాక రాజు డిమాండ్



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య)** గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వే బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు లకపాక రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆశా వర్కర్ల సమస్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ ఏఓ మహబూబ్ అలీకి వినతిపత్రం అందజేశారు.2022 నుంచి 2025 వరకు లెప్రసీ సర్వే బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వడంతో పాటు ఎన్నికల విధులు, బీఎల్ఓ సర్వే, పల్స్ పోలియో తదితర పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ నెల 26న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దండంపల్లి సత్తయ్య, పింజెర్ల సైదులు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, ప్రధాన కార్యదర్శి టి. వెంకటమ్మ, నవనీత, పద్మ, సీహెచ్ వీరభద్రమ్మ, శోభారాణి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

### గుర్రంపోడులో ప్రచార పత్రాల విడుదల



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య)** నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న తెలంగాణ రైతు సంఘం 36వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు మల్లం మహేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాల్లో గోడపత్రాలు, కరపత్రాలను విడుదల చేసి ప్రచారం నిర్వహించారు.మల్లం మహేష్ మాట్లాడుతూ నవంబర్ 15న నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చట్టం తీసుకురావాలని, ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేయాలని, డిండి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా నిధులను విడుదల చేయాలని, రుణమాఫీ అమలు చేయాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు న్యాయం చేయాలని అన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణ, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా రైతులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి సర్వయ్య, రైతు సంఘం నాయకులు రాములు, మల్లయ్య, రవి, స్థానిక రైతు సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# డిండి లిఫ్ట్‌ను వెంటనే రద్దు చేయాలి

**- పాలమూరు రైతుల హక్కులను హరించొద్దు..**

**సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ డీకే అరుణ డిమాండ్...**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):**

డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వెంటనే రద్దు చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లాకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సీఎం పదవి శాశ్వతం కాదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పాలమూరు రైతాంగం హక్కులను హరించవద్దని హితవు పలికారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

**పాలమూరు ప్రయోజనాలే ప్రాధాన్యం కావాలి**

పాలమూరు ప్రజల ఆశీర్వాదంతోనే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారని, అదే జిల్లాకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకోవడం సరికాదని డీకే అరుణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సొంత గ్రామం కూడా డిండి లిఫ్ట్ ప్రాజెక్టు పరిధిలోకి వస్తుందని గుర్తుచేశారు. రెండు జిల్లాల మధ్య వివాదాలు సృష్టించే విధంగా వ్యవహరించవద్దని సూచించారు. డిండి ప్రాజెక్టు రద్దు చేసే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాను మంత్రిగా పనిచేస్తూ పాలమూరు జిల్లాలోని ప్రతి ఎకరాకు నీరు అందించాలనే లక్ష్యంతో 72వ జీవో తీసుకరావడంలో కృషి చేశానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటి అప్రోచ్‌ను జూరాల నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్‌కు మార్చడం ద్వారా అప్పటి ప్రభుత్వం 105వ జీవో తీసుకొచ్చిందని, దీనివల్ల పాలమూరు ప్రాంతానికి నష్టం జరిగిందని ఆరోపించారు.

**డిండి ప్రాజెక్టుతో 30 గ్రామాలకు ముంపు ప్రమాదం**

డిండి లిఫ్ట్ ద్వారా రోజుకు 0.5 నుంచి 0.6 టీఎంసీల నీటిని నల్లగొండ జిల్లాకు తరలించే ప్రతిపాదనలు పాలమూరు రైతాంగానికి ఇబ్బందికరంగా మారుతున్నాయని డీకే అరుణ అన్నారు. ఈ ప్రాజెక్టు కారణంగా సుమారు 30 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. 2016లో పాలమూరు ప్రజల ఆందోళనల నేపథ్యంలో డిండి పనులు వెనక్కి తగ్గాయని గుర్తుచేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ ప్రాజెక్టును ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మళ్లీ ముందుకు తీసుకెళ్తున్నారని విమర్శించారు. మునుగోడు, దేవరకొండ ప్రాంతాల్లో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం కోసం పుట్టంగండి లిఫ్ట్‌ను చేపట్టారని, అక్కడి నుంచి ఎస్ఎల్‌బీసీ కాలువల ద్వారా నీటిని తరలించే ఏర్పాట్లు ఉన్నాయని వివరించారు. నల్లగొండ జిల్లాకు ఎస్ఎల్‌బీసీ, నాగార్జునసాగర్, నక్కలగండి వంటి ఇతర మార్గాల ద్వారా నీటిని అందించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పాలమూరు రైతులకు కేటాయించిన నీటి ప్రయోజనాలకు భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయాలి**

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో ఎందుకు పూర్తి చేయడం లేదని డీకే అరుణ ప్రశ్నించారు. ప్రాజెక్టు మొదటి డీపీఆర్‌ను సమీక్షించి, జూరాల నుంచి నీటిని తీసుకొచ్చే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి నియోజకవర్గానికి సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్లను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు అవసరమైన చోట కొత్త రిజర్వాయర్లను నిర్మించాలని అన్నారు. కొండంగల్, నారాయణపేట ప్రాంతాలకు ప్రతిపాదిస్తున్న లిఫ్ట్ పథకాలతో ఆయా ప్రాంతాలు ఎంతవరకు సస్యశ్యామలం అవుతాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా అదనంగా ఒక్క ఎకరా ఆయకట్టును కూడా తీసుకురాలేదని విమర్శించారు. మూడేళ్లలో ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టునైనా పూర్తి చేశారా అని ప్రశ్నించారు. 10.5 టీఎంసీల కేటాయింపులు ఉన్న ఆర్డీఎస్ ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టడం లేదని, 17.84 టీఎంసీల కేటాయింపులు ఉన్న జూరాల నుంచి పూర్తిస్థాయిలో నీటిని వినియోగించుకోలేకపోతున్నామని పేర్కొన్నారు. జూరాల మరమ్మతులు, ప్రాజెక్టు బలోపేతం, బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

**డిండి ద్వారా తరలించే నీటిని పాలమూరుకే కేటాయించాలి**

శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి డిండి వైపు తరలించే ప్రతి నీటి చుక్కపై పాలమూరు రైతాంగ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని డీకే అరుణ అన్నారు. డిండి ప్రాజెక్టు కోసం ప్రతిపాదిస్తున్న 0.6 టీఎంసీల నీటిని కూడా పాలమూరు రైతులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు మొదటి డీపీఆర్‌ను సమీక్షించి, జూరాల ఆధారంగా నీటిని అందించే అంశంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. జిల్లా ప్రయోజనాల కోసం ప్రజలు మంత్రులు, ఎమ్మెల్యేలను ఎన్నుకున్నారని, వారు వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డిండి లిఫ్ట్ రద్దు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని తెలిపారు. పాలమూరు ప్రాంతానికి అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండబోమని, డిండి లిఫ్ట్ రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని డీకే అరుణ స్పష్టం చేశారు.



ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యక్షులు హరీశ్వర్‌రెడ్డి, ఉమ, హైదేవి, అధికార ప్రతినిధి సందీప్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# మోదంపల్లి అభివృద్ధికి రూ.1.33 కోట్ల నిధులు

**- సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి..**

**- మూడు గ్రామాల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..**

**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):**

మోదంపల్లి గ్రామ అభివృద్ధికి రూ. 1.33 కోట్ల నిధులు మంజూరయ్యాయి. హెచ్ఎండీఏ ద్వారా మంజూరైన ఈ నిధులతో గ్రామంలో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మోదంపల్లి, ఏడుగుట్టల, జగన్నాథ్ తండాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం తన బాధ్యతని, ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో పాదయాత్రలో భాగంగా మోదంపల్లి గ్రామాన్ని సందర్శించినప్పుడు మోకాళ్ల లోతు నీటితో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశానని గుర్తుచేశారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం రూ. 1.33 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. అలాగే గ్రామంలోని దేవాలయానికి రూ. 5 లక్షలు అందజేస్తానని గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆ మొత్తాన్ని కూడా అందించినట్లు తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో ప్రజల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు మురుగునీటి సమస్యలు తగ్గి



పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**వ్యక్తిగత సమాచారం భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత: కలెక్టర్ ఖుష్బూ గుప్తా...**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):**

ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు కొత్త రూపాల్లో పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ ), మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి పాల్గొని సైబర్ భద్రతపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులు, సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఆధార్, పాన్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకునే ముందు వాటి విశ్వసనీయత, అనుమతులను పరిశీలించాలని, గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను తెరవవద్దని హెచ్చరించారు.

**మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి...**

సైబర్ నేరగాళ్లు ప్రజల అమాయకత్వం, అత్యాశ, భయాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ డి. జానకి తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా ఫిర్యాదు చేయడం ద్వారా మోసగాళ్ల ఖాతాల్లోకి బదిలీ అయిన డబ్బును నిలిపివేసే అవకాశం ఉంటుందని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం అందించాలని తెలిపారు.

**పిల్లల ఆన్‌లైన్ భద్రతపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి...**

పిల్లలు ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా యాప్‌లను ఉపయోగిస్తున్నప్పుడు తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలని ఎస్పీ సూచించారు. సైబర్ వేధింపులు, అపరిచితులతో ఆన్‌లైన్ పరిచయాలు, అనుచిత కంటెంట్ వల్ల కలిగే ప్రమాదాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. చిన్నారులకు సంబంధించిన లైంగిక దోపిడీ చిత్రాలు, వీడియోలను వీక్షించడం, భద్రపరచడం లేదా ఇతరులకు పంపడం తీవ్రమైన చట్టపరమైన పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. పిల్లల ఆన్‌లైన్ భద్రత విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.




**సైబర్ నేరాలకు పాల్పడిన ఏడుగురి ముఠా అరెస్టు...**

జిల్లాలోనూ సైబర్ నేరాలకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఎస్పీ వెల్లడించారు. ఇటీవల తువ్వగడ్డ తండా ప్రాంతంలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ రూపొందించిన సైబర్ నేరాల నివారణ అవగాహన పోస్టర్లను కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి. జానకి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి నిర్మల, సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరి కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న లక్ష్మారెడ్డి

**మిడ్జిల్ అక్టోబర్ 24 ( వార్తా వేదిక సూర్య ):** మహబూబ్నగర్ జిల్లా మిడ్జిల్ మండలం మంగలిగడ్డ తాండ గ్రామపంచాయతీ తుల్జా నాయక్ తండాలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు మాజీ మంత్రివర్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎటు చూసినా పంటలు ఎండిపోతున్నాయి అని తెలియజేశారు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు ఎండిపోవడం చూసి రైతులకు ధైర్యం కల్పించారు ఎల్ ని నో ప్రభావంతో ఇలా జరిగాయని తెలియజేశారు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి అయి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని తెలియజేశారు గత ప్రభుత్వంలో కెనాల్ టెండర్లు పిలిచాం కరివేన రిజర్వాయర్ వరకు నీళ్లు తీసుకొచ్చే అవకాశం ఉన్న ప్రభుత్వం నిర్లక్ష్యం కనిపిస్తుందని విమర్శలు గుప్పించారు భూగర్భ జలాలు అడుగంటంలో విద్యుత్ సమస్యలు పెరుగుతున్నాయి విద్యుత్ సమస్యతో రాష్ట్రమంతటా లక్షలాది ఎకరాల పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు నీళ్లు కరెంటు విషయంలో కెసిఆర్ పాలన ముందు చూపుతో పనిచేసిందని తెలియజేశారు



## పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా వ్యాసరచన పోటీలు

**- విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: ఎస్పీ డి.జానకి..**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):**




పోలీస్ ఫ్లాగ్ డే--2026 సందర్భంగా తెలంగాణ పోలీస్ శాఖ విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు, అలాగే డిగ్రీ, ఆపై విద్యార్హతలు కలిగిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో నిర్వహించే ఈ పోటీల్లో సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ నిర్మూలన, సోషల్ మీడియా దుర్వినియోగం, తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో వ్యక్తిగత పాత్ర వంటి అంశాలపై వ్యాసాలు రాయాలి. వ్యాసం 500 పదాలకు మించకూడదు. కాగితంపై రాసిన వ్యాసాన్ని ఫోటో లేదా పిడిఎఫ్ రూపంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. చివరి తేదీ: అక్టోబర్ 27, 2026. ఎచ్ టీ టీ పి ఎస్ ://ఫార్మ్స్ .జి ఎల్ ఈ / వై కె ఈ కె యూ ఎస్ ఈ డబ్ల్యూ యూ 5ఎల్ ఎఫ్ వై డబ్ల్యూ ఎఫ్ ఎచ్ 7 ఈ వెబ్ సైట్ లో విద్యార్థులు ఆన్లైన్ చేయాలని అన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సైబర్ భద్రత, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని ఎస్పీ తెలిపారు. జిల్లా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# మహబూబ్‌నగర్

## శ్రీనివాసులు పార్థివ దేహానికీ పూల మాల నివాళులు



**నాగర్ కర్నూలు అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య)**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం శనివారం పేషకరి హనుమత్ కుమారుడు చీ. శ్రీనివాసులు పార్థివ దేహాన్ని కీ పూల మాల నివాళులు అర్పించిన.... ఎస్సీ ఎస్టీ బీసీ ఓబిసి మైనారిటీ ఫోరం జాతీయ అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు గారు మరియు బిఎస్పీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పృథ్వీ రాజ్ తో పాటు ప్రజా కుల సంఘాల నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు... ఈ పేషకరి హనుమత్ కుమారుడు శ్రీనివాసులు మరణం కుటుంబానికి కాకుండా ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలందరికీ, క్రీడాకారులకు తీరని లోటని పేర్కొన్నారు.. ఈ శ్రీనివాసులు 35 సంవత్సరాలు పాటు మంచి హాకీ 🏑 ఆటగాడు మంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారుడు... మా యెక్క క్రీడా గురువులు అబ్దులఖాన్ , తులజీ దాస్ క్రిశేషులు, ఇతని బ్యాచ్ మెంట్లు సి. పురుషోత్తం, నాగరాజు, బారసావులు, విష్ణు మూర్తి, రామకృష్ణ, వంకేశ్వరం నిరంజన్,జి. సుధాకర్ తదితరులు వీళ్ళతో కలిసి నాగర్ కర్నూల్ లోని నేషనల్ ఉన్నత పాఠశాల గ్రౌండ్ లో, జూనియర్ కళాశాల మైదానంలో ఎంతో ఆనందంతో కలిసి ఆడే వాళ్ళము తాలుకా నుంచి రాష్ట్ర స్థాయి , నేషనల్ స్థాయి కూడా ఆడిన వ్యక్తి ఇతనుఆటలతో పాటు సమాజ సేవ కూడా చేసేవాడు శ్రీనివాసులు ఇలాంటి వ్యక్తి మరణించడం తీరని లోటని ధర్మరాజు గారు ఆవేదన వ్యక్తంచేశారు... వారి కుటుంబానికి మనో ధైర్యం కల్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నాను.

## పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 23 (వార్తా వేదిక సూర్య):**

ప్రజా ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారమవుతోందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాలకు భరోసాగా నిలుస్తోందని గురుకుంట గ్రామ సర్పంచ్ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గురుకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల లబ్ధిదారులకు ఆయన ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవాన్ని, భద్రతను అందిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందడం సంతోషకరమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, జడ్చర్ల ఎమ్మెల్యే జంపల్లి అనిరుధ్‌రెడ్డికి లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోవళ్ల రాజశేఖర్, వార్డు సభ్యులు హరీష్, దామోదర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీజ, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు వెంకటయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## నవాబుపేట మండలంలో పశువుల దొంగతనాలు.. రైతుల్లో ఆందోళన..

**మల్రెడ్డిపల్లిలో రెండు గేదెలు, ఒక ఆవు అపహరణ..**

**రాత్రివేళల్లో పోలీసుల నిఘా పెంచాలని రైతుల విజ్ఞప్తి..**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య):**

నవాబుపేట మండలంలో పశువుల దొంగతనాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మండలంలోని మల్రెడ్డిపల్లి గ్రామ శివారులో రైతుకు చెందిన రెండు గేదెలు, ఒక ఆవును గుర్తుతెలియని వ్యక్తులు గత రాత్రి అపహరించినట్లు సమాచారం. కష్టపడి పశువులను పెంచుకుంటున్న రైతులకు ఈ ఘటన ఆర్థికంగా నష్టం కలిగించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో భద్రతపై ఆందోళనను పెంచుతోంది. బాధిత రైతు జి. రామచంద్రయ్య ఫిర్యాదు మేరకు నవాబుపేట ఎస్సై వి. నరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పశువులను ఎవరు అపహరించారు? వాటిని ఎక్కడికి తరలించారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి పశువులను తిరిగి రాబట్టాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, కొన్ని రోజుల క్రితం యన్మంగండ్ల గ్రామానికి చెందిన జమీర్ అనే రైతు ఆవును కూడా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు స్థానికులు తెలిపారు. వరుసగా పశువుల దొంగతనాలు చోటుచేసుకుంటుండటంతో మండలంలోని రైతులు అప్రమత్తమవుతున్నారు. వ్యవసాయంతో పాటు పశుపోషణపై ఆధారపడే రైతులకు పశువులే జీవనాధారం. పాలు, వ్యవసాయ అవసరాల ద్వారా ఆదాయం పొందుతున్న రైతులకు పశువులు దొంగతనానికి గురైతే తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామ శివార్లు, పశువుల కొట్టాలు, పొలాల పరిసర ప్రాంతాల్లో రాత్రివేళల్లో పోలీసుల నిఘా పెంచాలని రైతులు కోరుతున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పశువుల దొంగతనాలను అరికట్టి, బాధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.








# పెద్దపల్లి

## నూతన ఎస్ఐ రాజశేఖర్‌కు టిఆర్పి జిల్లా అధ్యక్షులు చందర్ యాదవ్ శుభాకాంక్షలు



**పెద్దపల్లి, అక్టోబర్ -24, (వార్త వేదిక సూర్య):**

పెద్దపల్లి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పోలీస్ శాఖకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్ తెలిపారు. నూతనంగా పెద్దపల్లి టౌన్ ఎస్.ఐ గా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ... పెద్దపల్లి పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో రాజశేఖర్ ముందుంటారని ఆకాంక్షిస్తున్నామన్నారు. పోలీస్ శాఖకు పార్టీ తరపున ఎల్లప్పుడూ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ మెరుగు సతీష్ గౌడ్, జిల్లా జాయింట్ సెక్రటరీ కాంపెల్లి స్వామి, పెద్దపల్లి మున్సిపల్ అధ్యక్షులు వెంగల కృష్ణ, పెద్దపల్లి మండల అధ్యక్షులు కళాబోయిన సంపత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులతో పాటు దేవస్థానం పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- వచ్చే నెల 4న మంత్రి శ్రీధర్ బాబు కాళేశ్వరం పర్యటన
- నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి
- దేవదాయ కమిషనర్ హనుమంతరావు



**మంథని, అక్టోబర్ -24,(వార్త వేదిక సూర్య):**

గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరంలో పుష్కరఘాట్ల అభివృద్ధి పనులతో పాటు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హను మంతరావు అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివా రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కాళేశ్వరం క్షేత్రంలో పర్యటించిన కమిషనర్ దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టిన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ ప్రత్యేకంగా పరిశీలించారు. అన్ని నిర్మాణ పనులను సమాంతరంగా చేపట్టి, అవసరమైనంత మంది కార్మికులను నియమించి షిఫ్టుల వారీగా పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అక్షరాభ్యాస మండపం, అద్దాల మండపం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఆలయ పునర్నిర్మాణాన్ని రూపొందించిన ప్రణాళికకు, సంప్రదాయ వాస్తు నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి మార్పులు, వ్యత్యాసాలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా కాంక్రీట్ పనుల్లో వైబ్రేటర్లను వినియోగించాలని, గోనె సంచులు, వరి గడ్డితో తగిన విధంగా వాటర్ క్యూరింగ్ చేపట్టాలని సూచించారు. ప్రతి నిర్మాణ పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి పటిష్ఠంగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కాళేశ్వరంలో ఆలయ పునర్నిర్మాణ పనులతో పాటు గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ పర్యటనలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు

# అవసరమైన అన్ని పనులు పూర్తి చేయాలి

- మంథనిలోని ప్రముఖ ఆలయాల సందర్శన
- మంథని పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్ల పురోగతిని పరిశీలించిన పుష్కరాల ప్రత్యేక అధికారి హనుమంతరావు
- కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**మంథని, అక్టోబర్ 24, (వార్త వేదిక సూర్య):**

2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందస్తు ప్రణాళికతో అవసరమైన పనులన్నీ చేపట్టాలని పుష్కరాల ప్రత్యేక అధికారి మరియు డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. శనివారం మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద పుష్కరాల ఏర్పాట్ల పురోగతిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి పుష్కరాల ప్రత్యేక అధికారి మరియు డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధి, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా స్నానఘట్టాలు, రాకపోకల మార్గాలు, అవసరమైన ఇతర సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని తెలిపారు. చేపట్టాల్సిన పనులను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి, అవసరమైన అనుమతులు పొందుతూ పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పుష్కరాల ప్రత్యేక అధికారి మరియు డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథనిలోని గౌతమేశ్వర స్వామి ఆలయం, ఓంకారేశ్వర స్వామి ఆలయం, సురబండేశ్వర స్వామి ఆలయం, మహాలక్ష్మి ఆలయం, లక్ష్మీనారాయణ ఆలయాలను సందర్శించారు. ఆలయాల పరిస్థితి, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించి, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ , వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి,సీఈ దుర్గాప్రసాద్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ , తహసీల్దార్ ఆరిఫో ద్దీన్, ఈఓ రాజ్‌కుమార్, ఏసీపీ మడత రమేష్, సీఐ స్వామి, గౌతమేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ గుండ రాజు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్ పోస్ట్ ఏర్పాటు

అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

**మంథని, అక్టోబర్ -24, (వార్త వేదిక సూర్య):**




మంథని నియోజకవర్గం మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. నివారం పౌర సరఫరాల శాఖ, పోలీస్, పంచాయతీ శాఖల అధికారులు సిబ్బందితో కలిసి సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర లభించేలా చూడటంతో పాటు, పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని అక్రమంగా తెలం గాణలోకి తరలించకుండా నిరోధించేందుకు ఈ తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావులేకుండా, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కాళేశ్వరం అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పోలీసు, పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వ యంతో 24 గంటల పాటు నిరంతర తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సరిహద్దు దాటి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. తనిఖీల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహిం చాలని సిబ్బందిని ఆదేశించారు. రైతుల సంక్షేమం, పండించిన పంటకు మద్దతు ధర కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, పోలీస్, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- పీఎం రాహత్ పథకం ద్వారా రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలి
- పథకం అమలుకు అన్ని ఆసుపత్రులు తప్పనిసరిగా నమోదు కావాలిలి
- ఈ-డీఏఆర్ పోర్టల్‌లో ప్రతి ప్రమాద కేసు నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలిలి

**పెద్దపల్లి,అక్టోబర్ 24(వార్త వేదిక సూర్య):**



రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో వైద్య చికిత్స అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రమాద బాధితులకు చికిత్స ఖర్చుతో సంబంధం లేకుండా సమీపంలోని ఆసుపత్రుల్లో తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు.రోడ్డు ప్రమాద బాధితుల చికిత్స పథకం-2025 కింద పీఎం రాహత్ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పెద్దపల్లి లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి పాల్గొన్నారు. పీఎం రాహత్ పథకం అమలు విధానం, ఆసుపత్రుల్లో బాధితులకు వైద్య సేవలు అందించే ప్రక్రియ, ప్రమాద వివరాల నమోదు, క్లెయిమ్‌ల ఆమోదం, నిధుల విడుదల తదితర అంశాలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి వైద్య చికిత్స అందించడం అత్యంత కీలకమని తెలిపారు. గోల్డెన్ అవర్‌లో తగిన చికిత్స అందించడం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రమాద బాధితులను చికిత్స ఖర్చుల గురించి ఆలోచించకుండా సమీపంలోని ప్రభుత్వ లేదా పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. పీఎం రాహత్ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల వరకు చికిత్స ఖర్చును నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఈ పథకం కింద చికిత్స పొందుతున్న ప్రమాద బాధితుల సంఖ్య తక్కువగా ఉందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పథకం ప్రయోజనాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఆదేశించారు .పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఏటా సుమారు రూ.100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధులను ఆదా చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాద బాధితులకు మొదట పీఎం రాహత్ పథకం కింద నిర్దేశిత పరిమితి వరకు చికిత్స అందించాలని, ఆ పరిమితి దాటిన తర్వాత కూడా వైద్యపరంగా అవసరమైతే నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించి బాధితుల ప్రాణాలను కాపాడాలని సూచించారు.

### పథకం అమలుకు అన్ని ఆసుపత్రులు నమోదు కావాలి

పీఎం రాహత్ పథకాన్ని అమలు చేసేందుకు జిల్లాల్లోని అన్ని ఆసుపత్రులు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ పథకం అమలుకు అవసరమైన నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నమోదైన ఆసుపత్రుల్లో ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అర్హులైన బాధితులకు పథకం ప్రయోజనాలు అందకుండా ఉండే పరిస్థితులు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ, పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులు రోడ్డు ప్రమాద కేసులను నేషనల్ హెల్త్ అథారిటీకి చెందిన టీఎంఎస్ 2.0 పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఈ-డీఏఆర్ (వణూ=) పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు అవసరమైన ధ్రువీకరణలు, ఆమోదాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

### రోడ్డు ప్రమాద ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలి

ప్రతి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో ప్రమాదాల వివరాలు, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, పెండింగ్ కేసులు, క్లెయిమ్‌ల ఆమోదం, ఆసుపత్రులకు నిధుల చెల్లింపులపై సమీక్షించాలని సూచించారు.

జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారిని జిల్లా రోడ్డు భద్రతా కమిటీలో క్రియాశీల సభ్యుడిగా చేర్చి, ఈ-డీఏఆర్, పీఎం రాహత్ పోర్టళ్ల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారం పొందాలని తెలిపారు. ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, బాధితులకు చికిత్స పూర్తికాకముందే పథకానికి సంబంధించిన ప్రక్రియల కారణంగా ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి చేసే పరిస్థితి రాకుండా చూడాలని స్పష్టం చేశారు. పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్ మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ యాప్ ద్వారా రోడ్డు ప్రమాదాల సమాచారం అందించడం, క్లెయిమ్‌ల స్థితిని తెలుసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి సంక్షోభంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హెచ్చరిక

**పెద్దపల్లి,అక్టోబర్ 24,( వార్త వేదిక సూర్య ):**

హైదరాబాద్‌లో తాగునీటి సంక్షోభాన్ని నివారించేందుకు కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే హైదరాబాద్ ప్రజలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కె.పి. వివేకానంద గౌడ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సందర్శించారు. గోదావరి జలాలు పెద్ద మొత్తంలో దిగువకు ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తున్నప్పటికీ, హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వాటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని వారు ఆరోపించారు. జూన్ నుంచి ఇప్పటివరకు సుమారు 750 టీఎంసీలకు పైగా గోదావరి జలాలు సముద్రంలో కలిశాయని నేతలు పేర్కొన్నారు. కనీసం 250 టీఎంసీల నీటిని ఎత్తిపోసినా జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలు పెరిగేవని, భూగర్భ జలమట్టాలు మెరుగుపడటంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ఉపశమనం లభించేదని అభిప్రాయపడ్డారు.

### ప్రజలకు నీటి కష్టాలు.. ప్రభుత్వానికి పట్టదా?



కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, నీటి సంక్షోభాన్ని పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. హైదరాబాద్ ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా కనీసం ఇప్పటికైనా గోదావరి జలాలను ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. గతంలో కరోనా సమయంలోనూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు నీరు, విద్యుత్ సహా అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గౌడ్ మాట్లాడుతూ, జూలైలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి వెళ్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. ప్రజల నీటి సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజలే ముఖ్యమంత్రికి తగిన సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌కు ఏడాది పాటు తాగునీరు అందించేందుకు సుమారు 10 టీఎం సీల నీరు సరిపోతుందని పేర్కొంటూ, కన్నెపల్లి నుంచి వెంటనే నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు.

### మేడిగడ్డపై చర్యలేవీ?

ఎమ్మెల్యే డి. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లను లక్ష్యంగా చేసుకుని పేలుడు ఘటన జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మరమ్మతుల పనులు కూడా చేపట్టలేదని ఆరోపిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారంతో తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని, అక్టోబర్ నెలలో రోజుకు సుమారు 7,000 ట్యాంకర్ బుకింగ్స్ జరుగుతున్నాయని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఇది వేసవి కాలాన్ని తలపించే పరిస్థితి అని, నగరంలో నీటి కొరత తీవ్రతకు నిదర్శనమని అన్నారు.

### కాళేశ్వరం నీటిని వినియోగించుకోవాలి.

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల ప్రశ్నలను పక్కదారి పట్టించే రాజకీయాలతో తప్పించుకోలేరని విమర్శించారు. విలువైన గోదావరి జలాలు సముద్రంలో కలుస్తుండగా, హైదరాబాద్ తాగునీటి సంక్షోభం దిశగా వెళ్లడం ఆందోళనకరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి ప్రజలకు తాగునీటి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.



రంగారెడ్డి

# చాడ ప్రభుత్వ పాఠశాలలో..

# ఘనంగా పోలీస్ స్మారక దినోత్సవ వేడుకలు

- విద్యార్థులకు వ్యాసరచన పోటీలు
- గ్రామస్థులతో అవగాహన సదస్సు నిర్వహించిన ఎస్సై కుమారస్వామి యాదవ్

మోటకొండూరు, అక్టోబర్ 24(వార్త వేధిక సూర్య): పోలీస్ స్మారక దినోత్సవ వేడుకల సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల పరిధిలోని చాడ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మోటకొండూరు మండల ఎస్సై కుమారస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా చాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతులు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రెండు ముఖ్యాంశాలపై 1) సైబర్ నేరాల నివారణ,2) మాదక ద్రవ్యాల నివారణ పై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. సైబర్ నేరాల నివారణ: అంతర్జాలం ద్వారా జరుగుతున్న మోసాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరగాళ్లు చేసే మోసాల పట్ల విద్యార్థులు మరియు ప్రజలు ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలనే దానిపై అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండటానికి, డ్రగ్స్ వలన జీవితం మరియు సమాజంపై పడే తీవ్ర దుష్ప్రభావాల గురించి వివరించారు.







పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు

ఈ పోటీల అనంతరం చాడ గ్రామంలో గ్రామస్థులు మరియు యువకులతో కలిసి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల కట్టడికి ప్రజలందరి సహకారం ఎంతో అవసరమని ఎస్సై కుమారస్వామి యాదవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటూ, యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## స్థానికుల సమస్యలే ప్రాధాన్యం..

నాలా పరిస్థితిని పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు - మంద జగన్

సికింద్రాబాద్, అక్టోబర్ 24(వార్త వేదిక సూర్య): బౌద్ధనగర్ డివిజన్‌లోని ఈశ్వరీబాయి నగర్, ఏఆర్‌కే నగర్ మధ్య ఉన్న నాలాలో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు మాజీ వార్డు మెంబర్ మంద జగన్ అక్కడికి చేరుకొని నాలా పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ.. నాలాలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత దృష్ట్యా అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ చూపించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేయాలని పేర్కొన్నారు.

### విధులకు గైర్హాజరైన 54 మంది

## లైసెన్స్ సర్వేయర్ల సేవలు రద్దు

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి



రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 24:(వార్తా వేదిక సూర్య) : విధులకు హాజరుకాకుండా, షోకాజ్ నోటీసులకు స్పందించని 54 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను రద్దు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి వెల్లడించారు. జిల్లా పరిధిలో మొత్తం 281 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించగా, వారిలో 102 మంది విధులకు గైర్హాజరు కావడంతో అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులకు స్పందించిన 48 మంది తిరిగి విధుల్లో చేరగా, ఎలాంటి స్పందన ఇవ్వని మిగిలిన 54 మంది సర్వేయర్ల సేవలను రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకమని చంద్రా రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేయర్లందరూ రీ సర్వే పనుల్లో పాల్గొని, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రీ సర్వే పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరు కావడం, అధికారుల ఆదేశాలను పాటించకపోవడం వంటి నిర్లక్ష్య వైఖరిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. విధులకు హాజరుకాని సర్వేయర్ల స్థానంలో కొత్త లైసెన్స్ సర్వేయర్లను నియమించి, రీ సర్వే పనులు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిగిలిన సర్వేయర్లందరూ విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు.

### ఎండిపోయిన వరి పంటలకు

## నష్టపరిహారం చెల్లించాలి: సీపీఎం

మోటకొండూరు మండల కార్యదర్శి కొల్లూరు ఆంజనేయులు డిమాండ్



మోటకొండూరు, అక్టోబర్ 24(వార్త వేధిక సూర్య): అప్రకటిత కరెంటు కోతలు మరియు వర్షాభావ పరిస్థితుల కారణంగా నీరందక ఎండిపోయిన వరి పంటలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, ఎకరానికి తక్షణమే రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం పార్టీ మోటకొండూరు మండల కార్యదర్శి కొల్లూరు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం నాడు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మాటూరు పెద్దబావి గ్రామంలో రైతులు వాకిటి మల్లారెడ్డి, జిల్తారు యాదయ్య తదితరుల ఎండిపోయిన వరి పంట పొలాలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కొల్లూరు ఆంజనేయులు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా విద్యుత్ కోతల ప్రభావంతో బోర్లు ఎండిపోయి వందలాది ఎకరాల్లో వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి, అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడి పొట్ట దశకు వచ్చే సమయానికి నీరు అందక చేను కళ్ళముందే ఎండిపోతుండటంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారని తెలిపారు. కేవలం ఏ పంట వేశారనే సర్వేలు చేస్తున్నారే తప్ప, ఎండిపోయిన పంటలను మాత్రం అధికారులు పరిశీలించడం లేదని మండిపడ్డారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీరు అందక సంక్షోభంలో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, వ్యవసాయ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. రైతులను నిండా ముంచే అప్రకటిత కరెంటు కోతలను వెంటనే అరికట్టి, నిరంతరం 18 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల నాయకులు కాదూరి నరసింహ, మరియు బాధిత రైతులు వాకిటి మల్లారెడ్డి, వాకిటి అమృత, చిక్కుడు అంజయ్య, జిల్తారు యాదయ్య, మల్లయ్య, సర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను

## వేగవంతం చేయాలి: కొలన్ సుభాష్ రెడ్డి



రాజేంద్రనగర్, అక్టోంబర్ 24 ( వార్త వేదిక సూర్య ) : మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ సుభాష్ రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి సూచనల మేరకు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలతో శనివారం హైదర్‌గూడలోని సుభాష్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు పురోగతి, అర్హులైన ఓటర్ల గుర్తింపు, అవసరమైన పత్రాలు, నమోదు విధానంపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని కొలన్ సుభాష్ రెడ్డి సూచించారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని తాగునీటి సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన అంశాలపైనా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్, జాలిగం చిత్తారి, పోయిల జీవన్ దాస్, హైదర్‌గూడ అధ్యక్షుడు నరేందర్ రావు (చిన్న), అత్తాపూర్ అధ్యక్షుడు వనం శ్రీరామ్ రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి అధ్యక్షుడు గుమ్మడి కుమార్, ఎడ్లకాడి సూర్యం, సదాల వెంకట్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రాము యాదవ్, బంగి శ్రీనివాస్, ముకేశ్, లక్ష్మణ్, రాజేష్ యాదవ్, పచ్చ శ్రీనివాస్, అజయ్, నారాయణస్వామి, శ్రీవర్ధన్ రెడ్డి, కృష్ణారావు, వాసుతో పాటు వివిధ డివిజన్ల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### పట్టభద్రుల ఓటరు నమోదుపై

## అవగాహన కార్యక్రమం

మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక





సికింద్రాబాద్, అక్టోబర్ 24(వార్త వేదిక సూర్య) : మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక అధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. ఈ సందర్భంగా కొంతం దీపిక మాట్లాడుతూ..పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే సంబంధిత ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ముఖ్యమని వివరించారు. ఇందుకోసం అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకొని, నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమైనదని, అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అవకాశాన్ని పొందుతారని తెలియజేశారు. డివిజన్ పరిధిలోని ప్రతి ప్రాంతంలో అర్హులైన పట్టభద్రులకు ఈ సమాచారం చేరవేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జితూగుప్త ప్రశాంత్ జైన్ పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాలపై

## జీహెచ్ఎంసీ కొరడా

అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన 3, 4వ అంతస్తుల తొలగింపు







ఆదిభట్ల, అక్టోబర్ 24:(వార్త వేదిక సూర్య) : జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని ఆదిభట్ల సర్కిల్--15లో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. భవన నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై చర్యల్లో భాగంగా, అక్రమంగా నిర్మించిన 3వ, 4వ అంతస్తుల భాగాలను శనివారం తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఆదిభట్ల గ్రామ పరిధిలో సంబంధిత భవనానికి స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తుల వరకు మాత్రమే అనుమతులు ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా స్టిల్ట్ ప్లస్ నాలుగు అంతస్తుల వరకు నిర్మాణం చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. దీంతో అనుమతులకు మించి నిర్మించిన అదనపు అంతస్తుల భాగాలను తొలగించినట్లు కార్యాలయ రికార్డుల్లో నమోదు చేశారు. జీహెచ్ఎంసీ నిబంధనలను ఉల్లంఘిస్తూ భవన నిర్మాణాలు చేపట్టే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. భవన యజమానులు మంజూరైన నిర్మాణ అనుమతులు, అంతస్తుల పరిమితులు, సెట్‌బ్యాక్‌లకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనులు ప్రారంభించే ముందు సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందాలని, ఆమోదించిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో

## బొమ్మారెడ్డిగూడెం విద్యార్థుల ప్రతిభ

కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు,అందజేత



సంగారెడ్డి, వార్త వేదిక సూర్య అక్టోబర్ 24: బొమ్మారెడ్డిగూడెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-14 రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలవగా, వారి ప్రతిభను అభినందించిన కలెక్టర్ సర్టిఫికెట్లు, షీల్డులను అందజేసి సత్కరించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జె. సాయిచరణ్, ఉమేష్, చిన్నా, బబ్లూలను డీడీ అఖిలేష్ రెడ్డి, పీఈటీ సోనేష్ నాయక్, పాఠశాల హెచ్‌డబ్ల్యూఓ పి. భవాని అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించి, వారి ప్రతిభను గుర్తించిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పిఈటి విఠల్ , ఇండియా కోచ్ జైపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంగారెడ్డి సాయిబాబా ఆలయ రజతోత్సవాలు

శిఖర కుంభాభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన నిర్మల జగ్గారెడ్డి





సంగారెడ్డి, వార్తా వేదిక సూర్య ప్రతినిధి అక్టోబర్ 24: పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల సాయిబాబా ఆలయం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన రజతోత్సవాలు వైభవంగా జరిగాయి. కమిటీ పర్యవేక్షణలో, జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి సహకారంతో మూడు రోజు లపాటు యజ్ఞయాగాదులు, కుంభ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కూకట్‌పల్లికి చెందిన నరేష్ పంతులు నేతృత్వంలో 30 మంది వేద పండితు లు ఈ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదటి రోజు సుదర్శన యాగం, రెండో రోజు శత కలశాభిషేకం, మూడో రోజు శిఖర కుంభాభి షేకం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ సాగిన పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మూడో రోజు జరిగిన శిఖర కుంభాభిషే కంలో నిర్మల జగ్గారెడ్డి పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కమిటీ ముఖ్యులు టీ. కాశప్ప, కేవీ నర్సయ్య, ఎస్. వీరేందర్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
PRGI NO: TGTEL/25/A0308
సంపుటి : 2
సంచిక : 156
ఆదివారం 25 అక్టోబర్, 2026
SUNDAY 25 OCTOBER 2026



## రంగారెడ్డి

# అధికారుల నిర్లక్ష్యానికి అంతులేదా?

## రోడ్లపైనే చెత్తకుప్పలు.. ప్రజలకు నరకయాతన!

- మధురానగర్‌లో అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలు..
- మధుబన్ కాలనీ వద్ద చెత్త పాయింట్‌ను మార్చాలి : యు.విజయ్ కుమార్

రాజేంద్రనగర్, అక్టోంబర్ 24 ( వార్త వేదిక సూర్య ) : మైలార్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని టీడీపీ సీనియర్ నాయకుడు యు. విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్న ఆయన, రోడ్లపై గుంతలు, డ్రైనేజీ సమస్యలు, పేరుకుపోయిన చెత్తకుప్పలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్తకుప్పలతో దుర్వాసన.. దోమలతో ప్రజల అవస్థలు! : కాలనీల్లో చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, దుర్వాసనతో పాటు దోమల బెడద పెరుగుతోందని విజయ్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా మధుబన్ కాలనీ రోడ్డు సమీపంలోని చెత్త సేకరణ కేంద్రం ప్రజలకు ఇబ్బందిగా మారుతోందని, దానిని వెంటనే మరో అనువైన ప్రదేశానికి మార్చాలని కోరారు.ప్రజల సమస్యలు కనిపించడం లేదా? : ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని విజయ్ కుమార్ ప్రశ్నించారు. చెత్తకుప్పలను వెంటనే తొలగించడంతో పాటు అవసరమైన చోట చెత్త సేకరణ కేంద్రాలను మార్చాలని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల తీవ్రతను గుర్తించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మైలార్ దేవ్‌పల్లి డివిజన్‌ను చెత్త రహితంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్ది ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని యు. విజయ్ కుమార్ కోరారు.





### తెలంగాణలో బీజేపీ బలోపేతంపై

## కీలక నేతల సమావేశం

### హైదరాబాద్‌లో రాష్ట్ర బీజేపీ నాయకుల భేటీ..

### పాల్గొన్న తోకల శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్, అక్టోంబర్ 24 (వార్త వేదిక సూర్య ) : తెలంగాణ రాష్ట్ర బీజేపీ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్ని . ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న రాజకీయ కార్యక్రమాల నిర్వహణ, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం తదితర అంశాలపై నాయకులు చర్చించారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై దృష్టి సారించారు. అదేవిధంగా, రెండోసారి తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన సునీల్ బన్సల్‌ను, తెలంగాణ బీజేపీ సంస్థాగత ఇన్‌చార్జి మధుకర్ జీ మర్యాదపూర్వకంగా కలిశారు.

## చలో హైదరాబాద్ ను జయప్రదం చేయండి

- యూనియన్ జిల్లా కార్యదర్శి గ్యార పాండు
- రంగారెడ్డి జిల్లా డిపిఓకు వినతి పత్రం అందజేత



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య) : గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గ్యార పాండు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రంగారెడ్డి జిల్లా డిపివోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్యార పాండు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 12790 గ్రామపంచాయతీలో 52,000 మంది గ్రామపంచాయతీ ఉద్యోగులు కార్మికులు పనిచేస్తున్నారని నిత్యం గ్రామాల్లో ప్రజలకు సేవలు చేస్తున్నారు. 2019 సంవత్సరంలో తీసుకువచ్చిన జీవో నెంబర్ 51 మల్టీపర్పస్ విధానం పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాడుగా మారిందన్నారు. ప్రతీ కార్మికుడు అన్ని పనులు చేయాలనే నిబంధనతో అనేకచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికులకు వేతనాలు పెంచి పర్మినెంట్ చేస్తామని ఎన్నికలకు మేనిఫెస్టోలో ప్రకటించింది. కానీ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్న ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా అమలు చేయటం లేదు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి, పిఆర్సి లో కూడా కార్మికులను గుర్తించాలని, కనీస వేతనం 30 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. కారోపర్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని, కార్మికుల అక్రమ తొలగింపు పై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పోచమోని కృష్ణ, జగన్ పోల్కంపల్లి, తదితరులు పాల్గొన్నారు.





### రైతు సమస్యలపై

## బికేఎస్ ఉద్యమం

### సోమవారం మండల కేంద్రాల్లో

సంగారెడ్డి వార్త వేదిక సూర్యఅక్టోబర్ 24: రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని భారతీయ కిసాన్ సంగ్ జిల్లా అధ్యక్షుడు పి. నర్సింహారెడ్డి ,ప్రధాన కార్యదర్శి పర్యాద రామకృష్ణారెడ్డి శనివారం పేర్కొన్నారు. ముఖ్యంగా లో వోల్టేజి సమస్యతో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. దీనివల్ల రైతులు లక్షలాది రూపాయలను నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా కూడా లేదన్నారు. వరంగల్ డిక్లరేషన్ ఆమలులో నిర్లక్ష్యం వల్ల రైతులను మోసం చేసినట్టుగా తెలుస్తుంది అన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ విషయంలో రైతుల ఆగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. చెరుకు టన్నుకుగాను ఐదువేల రూపాయలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ట్రాక్టర్ ట్రాలీని వ్యవసాయ పనిముట్టుగా గుర్తించాలని, రిజిస్ట్రేషన్ ను ఎత్తివేయాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఇంకా పెండింగ్లో ఉన్నాయని వారు చెప్పారు. సోమవారం నాడు ఈ సమస్యలపై మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు, అంతేకాకుండా తహసీల్దార్లకు ఎక్కడికి అక్కడే వినతిపత్రం సమర్పిస్తామని భారతీయ కిసాన్ సాంగ్ నేతలు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా రైతుల పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు సూచించారు.

### సున్నం చెరువు నీటిపై..

## అక్రమ దందాకు హైడ్రా చెక్!

### ఇళ్లలో బోర్లు వేసి నీటిని తోడేస్తున్న అక్రమార్కులపై

### భారీ ఆపరేషన్.. పైపుల తొలగింపు



రాజేంద్రనగర్, అక్టోంబర్ 24 ( వార్త వేదిక సూర్య ) : సున్నం చెరువు సమీపంలో దశాబ్దాలుగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ నీటి వ్యాపారంపై హైడ్రా అధికారులు కొరడా ఝుళిపించారు. ఇళ్లలో అక్రమంగా బోర్లు వేసి చెరువు పరిసరాల నుంచి నీటిని తోడుతూ వ్యాపారం చేస్తున్న వారిపై భారీ స్థాయిలో చర్యలు చేపట్టారు. నివాసాల నుంచి బయటకు వస్తున్న అక్రమ బోర్ల పైపులను తొలగించి నీటి దందాకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు. రెవెన్యూ, సి.ఎం.సి., హైడ్రా అధికారుల సమన్వయంతో, పోలీసుల బందోబస్తు మధ్య ఈ భారీ కార్యాచరణ కొనసాగింది. చెరువు సమీపంలో అక్రమంగా బోర్లు వేసి నీటిని తోడుతూ వ్యాపారం చేస్తున్న వ్యవహారంపై అధికారులు దృష్టి సారించి, పైపుల తొలగింపుతో చర్యలు చేపట్టారు. చెరువు నీటిని అక్రమంగా తోడుతూ వ్యాపారం చేస్తే సహించేది లేదనే సంకేతాన్ని ఈ చర్యల ద్వారా హైడ్రా ఇచ్చింది. చెరువుల పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు అక్రమ నీటి వ్యాపారులకు హెచ్చరికగా నిలుస్తున్నాయి. సున్నం చెరువు పరిసరాల్లో అక్రమ బోర్ల వ్యవహారంపై అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### రాజేంద్రనగర్ కాటేదాన్ డివిజన్ 116

## బృందావన్ కాలనీలో అగ్ని ప్రమాద భయం

### గోదాముల తొలగింపునకు స్థానికుల విజ్ఞప్తి



రాజేంద్రనగర్, అక్టోంబర్ 24 ( వార్త వేదిక సూర్య ) : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ డివిజన్ 116 బృందావన్ కాలనీలో నివాస ప్రాంతాల మధ్య ఉన్న గోదాముల వల్ల తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం ఇక్కడి ఒక పేపర్, కాటన్ గోదాంలో అగ్నిప్రమాదం సంభవించి భారీగా మంటలు చెలరేగడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇదే ప్రాంతంలో ఇళ్ల మధ్యలో మరికొన్ని గోదాములు ఉండటంతో పాటు, వాటిలో ప్రమాదకరమైన, త్వరగా మంటలంటుకునే (కాలిపోయే) వస్తువులను నిల్వ ఉంచడం పట్ల స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివాసాల మధ్య ఇలాంటి గోదాములు ఉంటే ఎప్పు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడిన స్థానికులు, తక్షణమే స్పందించి డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గోదాములలో ఉన్న వస్తువులు సులభంగా మంటలంటుకునే స్వభావం కలవని, ఇవి చుట్టుపక్కల నివసించే ప్రజల ప్రాణాలకు తీవ్ర ప్రమాదకరమని పోలీసులు నిర్ధారించారు. వెంటనే గోదాము యజమానితో మాట్లాడి పరిస్థితి తీవ్రతను వివరించారు. దీంతో స్పందించిన యజమాని గోదాములను ఖాళీ చేయడానికి పది రోజుల సమయం కోరినట్లు తెలిసింది. అయితే, గతంలో జరిగిన ప్రమాద అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, అధికారులు తక్షణమే స్పందించి నివాసిత ప్రాంతాల మధ్య ఉన్న ఇలాంటి ప్రమాదకర గోదాములను పూర్తిగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

### రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలలో

## స్మార్ట్ టీవీ ప్రారంభం

### ఆధునిక సాంకేతిక విద్యకు దాత రాహుల్ అగర్వాల్ చేయూత







రాజేంద్రనగర్, అక్టోంబర్ 24 ( వార్త వేదిక సూర్య ) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాజేంద్రనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్మార్ట్ టీవీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుధాకర్ హాజరయ్యారు. మండల విద్యాశాఖాధికారి శంకర్ రాథోడ్, పాఠశాలల సముదాయ ప్రధానోపా ధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్ని జార్ఖండ్‌కు చెందిన దాత రాహుల్ అగర్వాల్ విద్యార్థులకు దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా మెరుగైన విద్యను అందించాలనే ఉద్దేశంతో పాఠశాలకు స్మార్ట్ టీవీని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్మార్ట్ టీవీ ద్వారా పాఠ్యాంశాలను దృశ్యరూపంలో వివరించడం సాధ్యమవుతుందని, తద్వారా విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగి, అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని, విద్యార్థుల విద్యాభివృద్ధికి స్మార్ట్ టీవీ ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాలకు స్మార్ట్ టీవీని విరాళంగా అందించిన రాహుల్ అగర్వాల్‌కు కృతజ్ఞతలు

### శ్రీ విఠల్ రుక్మిణి దేవాలయంలో

## పాల్కి సోహాళా ఉత్సవం

### ఏఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, బండి రమేష్



కూకట్ పల్లి, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య) : కూకట్‌పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్‌లోని శ్రీ విఠల్ రుక్మిణి దేవాలయం లో శనివారం గ్యాన్ బా తుకారాం, జై జై రామ్ కృష్ణ హరి ఆహ్వానం మేరకు నిర్వహించిన పాల్కి సోహాళా ఉత్సవంలో ఏఐసిసి కార్యదర్శి శ్రీ సచిన్ సావంత్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్,టి పిసిసి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పాల్గొని,స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగ సచిన్ సావంత్, బండి రమేష్ మాట్లాడుతూ భారతదేశం అనేక భాషలు, మతాలు, సంస్కృతులు కలిగిన దేశం. కానీ మనల్ని కలిపి ఉంచేది మన ఐక్యత, మన సోదరభావం. మానవత్వం తో మనమంతా ఒక్కటిగా నిలబడాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, లక్ష్మయ్య,, గోపిశెట్టి రాఘవేందర్, గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, డివిజన్ అధ్యక్షులు, తూము సంతోష్, కాలికోట శంకర్, రాజేష్ శంకర్ కుమార్ గౌడ్, నియోజకవర్గం మైనారిటీ చైర్మన్ ఎండీ చున్ను పాషా, కాంగ్రెస్ నాయకులు సతీష్ గౌడ్, సప్పిడి భాస్కర్, కాలికోట బాలరాజ్, శివ చౌదరి, తూము సచిన్, టీంకు కార్యకర్తలు, నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### వేగం కంటే ప్రాణం ముఖ్యం.. రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన

### వేగం కంటే ప్రాణం ముఖ్యం.. ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం.. సురక్షితంగా గమ్యం చేరుదాం!



రాజేంద్రనగర్, అక్టోంబర్ 24 ( వార్త వేదిక సూర్య ) : విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ పి. నాగభూషణం సూచించారు. 'అరైవ్ అండ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్‌బీ నగర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ నాగభూషణం మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగించడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం ప్రమాదకరమని వివరించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. కారులో ప్రయాణించేవారు సీటుబెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత రహదారి భద్రతపై బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ఇతరులకు కూడా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ పి. నాగభూషణం, ఇన్‌స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్, ఆర్ఎస్ఐ పి. అనిల్ కుమార్‌తో పాటు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా

## ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలి

- పట్టభద్రుల ఓటరు నమోదు కాంగ్రెస్ విజయానికి తొలి అడుగు
- అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి
- పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



కూకట్ పల్లి, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య) : హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకునేందుకు మాజీ పట్టణ అధ్యక్షులు సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కెపిహెచ్బి టెంపుల్ బస్‌స్టాప్‌లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రతి ఓటునూ కీలకంగా భావించాలని, ఆన్లైన్ లో ఫాం–18 ద్వారా పట్టభద్రులందరి ఓట్లనూ నమోదు చేయించాలని, ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని ఆయన వివరించారు. ప్రతి ఓటరూను వ్యక్తిగతంగా కలవాలని సత్యం శ్రీరంగం సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడంతో పాటు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నాం. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించి, వారి సమస్యలను తెలుసుకుంటూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు కూడగట్టాలి. యువత కాంగ్రెస్ వైపు ఉన్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విపక్షాలకు పట్టభద్రుల ఎమ్మె ల్సీ ఎన్నికల్లో చావు దెబ్బ తప్పదన్నారు. ప్రగతి నిరోధకులకు పట్టబద్రులు ఈ ఎన్నికల ద్వారా తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్ష్యులు రాజేష్ గౌడ్, సీనియర్ నాయకులు సంజీవ్ రావు, దేశాల్, విట్టల్ రెడ్డి, సాదు ప్రతాప్ రెడ్డి, కొండల్ రెడ్డి, మేకల మైఖేల్, ఏఎంసీ డైరెక్టర్ ఫణి కుమార్, డివిజన్ మాజీ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, శ్రీధర్ చారి, బాబు రావు, దేవసహాయం రవి, నళినీ కాంత్, కొమ్ము బాబు,శ్రీధర్ చారి, గిరి నాయుడు, రామకృష్ణారెడ్డి, మొయిజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కళ్యాణ్ బాబు, దుర్గాప్రసాద్, మహిళా నాయకురాలు స్వాతి రెడ్డి, యమునా, భాగ్య, దీప్తి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కల నెరవేరుస్తాం

- నివాసయోగ్యమైన ప్రాంతాల్లో స్థలాల కేటాయింపునకు కార్యాచరణ
- న్యాయపరమైన చిక్కులు లేని శాశ్వత పరిష్కారంపై దృష్టి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పలుమార్లు చర్చించాం
- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది




హైదరాబాద్, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య): తెలంగాణ రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, కుటుంబాలతో గౌరవంగా నివసించేందుకు అనువైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారు. గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు మళ్లీ తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని భరోసా ఇచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో జర్నలిస్టుల గృహ నిర్మాణ సంఘానికి భూములు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. అయితే, ఈ భూముల కేటాయింపునకు సంబంధించిన వ్యవహారం సుప్రీంకోర్టులో న్యాయవివాదానికి దారితీయడంతో స్థలాల పంపిణీ ప్రక్రియ సుదీర్ఘకాలం నిలిచిపోయిందని తెలిపారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగినప్పటికీ, జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు అందించే విషయంలో గతంలో పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. దీంతో అనేక సంవత్సరాలుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆశలు నెరవేరకుండా పోయాయని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చొరవ తీసుకుందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2024 సెప్టెంబరు 8న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో జర్నలిస్టుల గృహ నిర్మాణ సంఘానికి భూమిని అప్పగించినట్లు గుర్తుచేశారు. అయితే, సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావడంతో ఈ వ్యవహారానికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చలు జరిపి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే అంశంపై సమగ్రంగా సమీక్షించినట్లు వెల్లడించారు. జర్నలిస్టుల సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎదురైన న్యాయపరమైన ఇబ్బందులు పునరావృతం కాకుండా, చట్టపరమైన వివాదాలకు తావులేని విధంగా స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కుటుంబాలతో నివసించేందుకు అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయడంతోపాటు, కేటాయింపుల ప్రక్రియలో చట్టపరమైన అంశాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించామని, మరోసారి తమ ప్రభుత్వంలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతోపాటు ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేయడంలో వారి సేవలు ముఖ్యమైనవని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, వారి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి:

### పసుపుల సందీప్ ముదిరాజ్



రాజేంద్రనగర్, అక్టోంబర్ 24 (వార్త వేదిక సూర్య):రంగారెడ్డి–హైదరాబాద్–మహబూబ్‌నగర్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. నమోదు సమయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే 9948312244 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.



## ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించాలి

- నీటి నాణ్యత పరీక్షల్లో నిర్లక్ష్యం వద్దు
- సిబ్బంది హాజరు, రికార్డులపై నిరంతర పర్యవేక్షణ
- అక్రమ నీటి కనెక్షన్లపై చర్యలు తప్పవు
- ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు రాకూడదు



గద్వాల, అక్టోబర్ 24 (వార్తా వేదిక సూర్య): జిల్లా ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని అందించే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. తాగునీటి శుద్ధి ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడటంతోపాటు, నీటి నాణ్యతను నిరంతరం పరీక్షించాలని స్పష్టం చేశారు. శనివారం ధరూర్ మండలంలోని జూరాల ప్రాజెక్టు వద్ద ఉన్న జిల్లా మిషన్ భగీరథ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి నీటి శుద్ధి ప్రక్రియ, నాణ్యత పరీక్షలు, రసాయనాల వినియోగం, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ప్రజలకు సరఫరా చేసే నీరు అన్ని ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని అధికారులకు సూచించారు. నీటి నాణ్యతను నిర్ధారించేందుకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నీటిలో పీహెచ్ స్థాయి, మసకదనం, క్లోరిన్ పరిమాణాలను పరీక్షించి సంబంధిత వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ముడినీటి నాణ్యతను బట్టి జార్ పరీక్షలు నిర్వహించి, శుద్ధి ప్రక్రియలో అవసరమైన రసాయనాలను సరైన మోతాదులో వినియోగించాలని స్పష్టం చేశారు. పరీక్షల ఫలితాలను క్రమం తప్పకుండా నమోదు చేయడంతోపాటు, నీటి నాణ్యతలో ఏవైనా మార్పులు గుర్తించినప్పుడు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు సరఫరా చేసే నీరు సురక్షితంగా ఉండేలా సాంకేతిక సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్లాంటులో సిబ్బంది హాజరు, విధుల నిర్వహణ, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ అంశాల్లో లోపాలు గుర్తించిన నేపథ్యంలో సంబంధిత ఔట్‌సోర్సింగ్ సంస్థతోపాటు బాధ్యులకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. సంస్థ చూపిస్తున్న సిబ్బంది సంఖ్యకు, వాస్తవంగా విధులకు హాజరవుతున్న వారి సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఉండకూడదని స్పష్టం చేశారు. విధులకు హాజరైన సిబ్బంది వివరాలను పరిశీలించిన తర్వాతే సంస్థకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు చేపట్టాలని సూచించారు. ప్లాంటులో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి హాజరును మీ ప్రమాణం అనువర్తనంలో తప్పనిసరిగా నమోదు చేసి, వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ప్లాంటుకు సంబంధించిన రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, విధుల వివరాలు, నీటి నాణ్యత పరీక్షల ఫలితాలు, సిబ్బంది హాజరు వంటి అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత అధికారులు, సంస్థ ప్రతినిధుల సంతకాలు రికార్డుల్లో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. రికార్డుల్లో తప్పులు, వివరాల నమోదులో లోపాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా సరిదిద్దాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను అధికారులు తరచూ తనిఖీ చేయాలని, సిబ్బంది విధుల నిర్వహణపై పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న తాగునీటి సరఫరా వ్యవస్థ ప్రజలకు సమర్థంగా సేవలందించేలా బాధ్యతతో పనిచేయాలని సూచించారు. నీటి సరఫరా వ్యవస్థలో అక్రమ కనెక్షన్లను అరికట్టి, ప్రతి ప్రాంతానికి నిబంధనల ప్రకారం నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమ కనెక్షన్ల కారణంగా ఇతర ప్రాంతాల ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. నీటిని నిబంధనలకు అనుగుణంగా వినియోగించుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అక్రమ కనెక్షన్లు గుర్తించినప్పుడు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన తాగునీరు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీధర్ రెడ్డి, నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు సంజీవ ప్రసాద్, ధరూర్ తహసీల్దార్ నందిని, ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ కార్యకర్తలకుతగిన గుర్తింపు, గౌరవం కల్పించాలి



జ్యోతి ప్రభంజనం, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 24: సమాచార హక్కు చట్టం--2005 అమలులో కీలక పాత్ర పోషిస్తూ, ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు కృషి చేస్తున్న ఆర్టీఐ కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని ఆర్టీఐ రక్షక్ గౌరవ అధ్యక్షులు ఎం.డి. అష్రఫ్, వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్టీఐ సతీష్ కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్‌కు పలు కీలక ప్రతిపాదనలతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు.

### కార్యకర్తల సేవలకు గుర్తింపు ఏదీ?

సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఆర్టీఐ కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆర్టీఐ సతీష్ పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై ప్రశ్నించడం, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం, ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నారని తెలిపారు. అయితే సమాచార కమిషన్ అధికారిక కార్యక్రమాల్లో అధికారులకే ఉత్తమ పనితీరు అవార్డులు అందిస్తూ, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆర్టీఐ కార్యకర్తలను విస్మరించడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు.

### ప్రజాస్వామ్య బలోపేతానికి ఆర్టీఐ కీలకం

ఈ సందర్భంగా ఆర్టీఐ సతీష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కేవలం సమాచారాన్ని పొందేందుకు మాత్రమే పరిమితమైనది కాదని, ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతను పెంచడానికి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి అధికారులను జవాబుదారీగా ఉంచడానికి శక్తివంతమైన ప్రజాస్వామ్య సాధనమని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని కోరారు. సమాచార కమిషన్, ప్రభుత్వ అధికారులు, ఆర్టీఐ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే చట్టం అమలు మరింత బలోపేతం అవుతుందని అన్నారు.ఆర్టీఐ రక్షక్ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి, సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సమాచార కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ రక్షక్ గౌరవ అధ్యక్షులు ఎం.డి. అష్రఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు లింగస్వామి, స్టేట్ మీడియా కన్వీనర్ ఆవనగంటి ఉపేందర్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆరు కీలక ప్రతిపాదనలు ఇవే..

**ఆర్టీఐ రక్షక్ తరఫున సమాచార కమిషన్ ముందు ఆరు ప్రధాన ప్రతిపాదనలను ఉంచారు.**

**ఉత్తమ ఆర్టీఐ కార్యకర్తలకు అవార్డులు:** ప్రజా ప్రయోజనాల కోసం సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా వినియోగిస్తున్న కార్యకర్తలు, దరఖాస్తుదారులను గుర్తించి అవార్డులు, ప్రశంసాపత్రాలు అందించాలి.

**కమిషన్ సమావేశాల్లో ప్రాతినిధ్యం:** సమాచార కమిషన్ నిర్వహించే ముఖ్యమైన సమీక్షలు, వార్షిక సమావేశాల్లో ఆర్టీఐ కార్యకర్తల ప్రతినిధులకు అవకాశం కల్పించి, వారి సమస్యలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి.

**విచారణల్లో పారదర్శకత:** అప్పీళ్లు, ఫిర్యాదుల విచారణలను సాధ్యమైన చోట ప్రత్యక్ష ప్రసారం చేసే విధానాన్ని పరిశీలించాలి. ఈ క్రమంలో చట్టపరమైన పరిమితులు, వ్యక్తిగత గోప్యత, న్యాయమైన విచారణకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

**నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై చర్యలు:** చట్టబద్ధమైన గడువులో సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే, సరైన కారణం లేకుండా సమాచారాన్ని నిరాకరించే అధికారులపై చట్ట నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలి. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 20(1), 20(2) ప్రకారం జరిమానాలు, శాఖాపరమైన చర్యలకు సంబంధించిన అధికారాలను సమర్థవంతంగా వినియోగించాలి.

**ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ బోర్డులు:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు కనిపించేలా సమాచార హక్కు చట్టం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రజా సమాచార అధికారి (పీఐఓ), మొదటి అప్పీళ్ల అధికారి (ఎఫ్ఏఏ) వివరాలు, దరఖాస్తు విధానం, ఫీజులు, సంప్రదింపు వివరాలను వాటిలో పొందుపరచాలి.

**రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు:** సమాచార కమిషన్ ఆధ్వర్యంలో ఆర్టీఐ కార్యకర్తలు, పౌర సమాజ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో కూడిన రాష్ట్రస్థాయి ఉన్నతస్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలి. చట్టం అమలులో ఎదురవుతున్న సమస్యలను సమీక్షించి, పరిష్కార మార్గాలను సూచించే వ్యవస్థను రూపొందించాలి.

# ఎన్వీఎస్ భాస్కర్ రావు ఆశయ సాధన కోసం

# పని చెయ్యడమే ఆయనకు నిజమైన నివాళి

## సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు బిఎన్ సుదర్శన్



బాలానగర్, అక్టోబర్ 24 (వార్త వేదిక సూర్య) : కూకట్ పల్లి నియోజకవర్గం లోని శ్రీ శ్రీ నగర్ సీఐటీయూ భవన్ లో ఎన్ వి ఎస్ భాస్కర్ రావు 42వ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పాఠానికి సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ సత్తయ్య పూల మాల వేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమం లో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు బి ఎన్ సుదర్శన్ పాల్గొని వారు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ సిపిఎం పార్టీ నిర్మాణంలో కీలకపాత్ర వహించిన కామ్రేడ్ ఎన్ వి ఎస్ భాస్కరరావు కీలక పాత్ర వహించారని, ట్రేడ్ యూనియన్ లు ఏర్పాట్లు కావడంలో కీలకపాత్ర వహించారు. అనునిత్యం పార్టీ ఆలోచనలే ఆయన కృషిగా ఉండేది. కార్యకర్తలకు చిన్న కష్టం వచ్చినా వెంటనే వాలిపోయి వారికి అండగా నిలబడే వ్యక్తిత్వం ఉన్న నాయకుడు కామ్రేడ్ భాస్కర్ రావు ఆయనకు నివాళులు అంటే ఈ సమాజంలో దోపిడీ వ్యవస్థను కూల్చడమే ఆయనకు నిజమైన నివాళులని అన్నారు. దేశంలో ప్రస్తుతం అప్రకటిత ఏమర్జెన్సీ బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తుంది అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తుంది ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కును తీసేసే ప్రయత్నం జరుగుతుంది. ప్రజాస్వామ్యంలో ధర్నా చేసుకోవాలంటే ధర్నా చౌక్ లోని ఎత్తివేస్తుంది జంతర్ మంతర్ ధర్నా చౌక్ ను ఎత్తివేసి ఓ నియంతల పాలన నడిపిస్తున్నారు. దేశంలో నిత్యవసర ధరలు పెరిగి ప్రజలకు భారంగా మారుతున్నాయి. ప్రజల దగ్గర కొనుగోలు శక్తి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్మికుల కనీస వేతనాలు ఇవ్వకుండా కార్మికులను శ్రమ దోపిడికి గురి చేస్తూ యాజమాన్యాల వైపు బిజెపి కేంద్ర ప్రభుత్వం ఉంటుంది. దేశంలో పోరాటాలు పెరిగిపోతున్నాయి ఈ అప్రకటిత ఎమర్జెన్సీని ఎదుర్కోవడం కోసం దేశంలోని ప్రజలు కార్మిక వర్గం వ్యవసాయ, కూలీలు రైతు కూలీలు అందరూ ఐక్యంగా పోరాడాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ పాల్గొని వారు మాట్లాడుతూ దేశంలో ప్రజలు కార్మికులు దైనందిక జీవితలతో జీవిస్తున్నారని, ప్రజల వద్ద కొలువుల శక్తి లేక, వారి రక్త మాంసాలను దారపోస్తూ శ్రమ దోపిడి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో జనరేషన్ జెడ్ యువత పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తుంటే వామపక్ష పార్టీలు ఐక్యంగా పోరాటాలు చేస్తుంటే, వారిని అక్రమంగా అరెస్టులు దాడులు చేస్తున్న ఈ దేశంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం వచ్చింది. దాంట్లో భాగంగానే బిజెపి విధానాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అయినా కాంగ్రెస్ అడుగులో మడుగుల బిజెపి అడుగుజాడల్లో రేవంత్ నడుస్తున్నారు. కార్మికుల కట్టు బానిసరిగా చేసే నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తామని రూల్స్ తయారు చేస్తుంది. దాన్ని వ్యతిరేకిస్తూ అక్టోబర్ 25, 26 తేదీల్లో చలో ఇంద్ర పార్క్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా డిసెంబర్ 1, 2,3 తేదీలలో చలో ఢిల్లీ జంతర్ మంతర్ కు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. వీటిని జయప్రదం చేయడం మనందరి బాధ్యత అని భాస్కర్ కి ఇవే నిజమైన నివ్వాలని మాట్లాడారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వెంకట నరసయ్య, సత్తయ్య, కృష్ణ నాయక్, ధర్మారావు, జోగారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విమానాశ్రయంలో చేదు అనుభవం..
# అనుపమ ఆవేదన



హైదరాబాద్, అక్టోబరు 24 (వార్త వేదిక సూర్య): అనుమతి లేకుండా ఫొటోలు తీశారని వెల్లడి చుట్టుముట్టి తాకడంతో అసౌకర్యం అభిమానులు హద్దులు పాటించాలని సూచన ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తనకు విమానాశ్రయంలో ఎదురైన చేదు అనుభవాన్ని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కొందరు వ్యక్తులు తనను చుట్టుముట్టి, అనుమతి లేకుండా ఫొటోలు తీయడమే కాకుండా, తనను తాకడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను మానసికంగా ఇబ్బంది పెట్టిందని తెలిపారు. ఇటీవల ఓ విమానాశ్రయంలో లగేజీ కోసం ఒంటరిగా వేచి చూస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు తన వద్దకు వచ్చారని అనుపమ వెల్లడించారు. మొదట తనతో మాట్లాడేందుకు ప్రయత్నించిన వారు, ఆ తర్వాత అనుమతి లేకుండానే ఫొటోలు తీయడం ప్రారంభించారని చెప్పారు. కొద్దిసేపటికే మరికొందరు అక్కడికి చేరుకుని తన చుట్టూ గుమిగూడారని వివరించారు. ఫొటోలు తీసే క్రమంలో కొందరు తనను తాకడంతో ఏం చేయాలో అర్థం కాలేదని, ఆ సమయంలో తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని ఆమె పేర్కొన్నారు. అభిమానులతో ఫొటోలు దిగడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అనుపమ స్పష్టం చేశారు. అయితే అభిమానమనే పేరుతో వ్యక్తిగత హద్దులు దాటడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఫొటోలు తీయడం, ఇబ్బందికరంగా తాకడం వంటి ప్రవర్తనలు ఆందోళన కలిగిస్తాయని చెప్పారు. ఇలాంటి సందర్భాల్లో ఎదుటివారు ఎలా ప్రవర్తిస్తారో తెలియక భయాందోళనకు గురవుతామని ఆమె వివరించారు. నటీనటులు ప్రజల్లోకి వెళ్లినప్పుడు అభిమానులు వారితో ఫొటోలు దిగాలని కోరుకోవడం సహజమే అయినప్పటికీ, పరస్పర గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇవ్వాలని అనుపమ సూచించారు. ఫొటో తీసే ముందు అనుమతి అడగడం, ఎదుటివారి ఇష్టాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఇబ్బందులు ప్రముఖ మహిళలకే పరిమితం కావని, సాధారణ మహిళలు కూడా వివిధ సందర్భాల్లో ఎదుర్కొంటున్నారని అనుపమ పేర్కొన్నారు. అసౌకర్యకర పరిస్థితులను ఎదుర్కొనే మహిళల ధైర్యాన్ని గుర్తించాలని అన్నారు. అభిమానాన్ని వ్యక్తం చేసే క్రమంలో ఇతరుల వ్యక్తిగత హద్దులను గౌరవించాలన్న ఆమె వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

# శ్రీ కార్తీక్ సరసన
# రుక్మిణి వసంత్!



హైదరాబాద్, అక్టోబరు 24 (వార్తా వేదిక సూర్య): 'తార'గా ప్రత్యేక పాత్రలో కన్నడ భామ తొలి కథ విన్నప్పటి నుంచే ఉత్సాహం త్వరలో కొత్త చిత్ర శీర్షిక ప్రకటన కన్నడ యువ నటి రుక్మిణి వసంత్ వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'కాంతార: చాప్టర్ 1'తో దక్షిణాది ప్రేక్షకులకు మరింత చేరువైన ఆమెకు తెలుగు చిత్ర పరిశ్రమలోనూ ఆదరణ పెరుగుతోంది. ఈ క్రమంలో తాజాగా మరో తెలుగు చిత్రానికి ఆమె అంగీకారం తెలిపారు. 'ఒకే ఒక జీవితం' సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న దర్శకుడు శ్రీ కార్తీక్ ఈ చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ కొత్త ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించిన చిత్రబృందం, సినిమాకు సంబంధించిన ఓ చిన్న ప్రచార దృశ్యాన్ని కూడా విడుదల చేసింది. ఈ సినిమా గురించి రుక్మిణి వసంత్ సామాజిక మాధ్యమాల వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. తొలిసారి కథ విన్నప్పటి నుంచే చిత్రబృందంలో ఎంతో ఉత్సాహం మొదలైందని తెలిపారు. చిత్రీకరణలో పాల్గొనే ప్రతి క్షణం కొత్త అనుభూతిని కలిగిస్తోందని పేర్కొన్నారు. చిత్రీకరణ ప్రదేశంలో నెలకొన్న సానుకూల వాతావరణం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని వెల్లడించారు. మొదటి రోజు నుంచే ఈ ఉత్సాహాన్ని అందించిన బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి మరిన్ని మంచి అనుభవాలు ఎదురుకావాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిత్రీకరణకు సంబంధించిన కొన్ని చిత్రాలను కూడా అభిమానులతో పంచుకున్నారు. ఈ సినిమాలో రుక్మిణి 'తార' అనే ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. ఆమె పాత్రకు కథలో ప్రాధాన్యం ఉండనున్నట్లు తెలుస్తోంది. అయితే పాత్ర స్వభావం, కథలో ఆమె ప్రాధాన్యానికి సంబంధించిన పూర్తి వివరాలను చిత్రబృందం ఇంకా వెల్లడించలేదు. శ్రీ కార్తీక్‌తో రుక్మిణి వసంత్ తొలిసారి జతకడుతుండటంతో ఈ కొత్త కలయికపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. మ్యాడ్ బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సిరుణి సినీ కార్పొరేషన్ సంస్థలపై మిసాయ్ కృష్ణ, దేవ్ రామ్‌నాథ్, శ్రీ కార్తీక్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి.

క్రీడలు

# టీ20ల్లో తిలక్ వర్మ ప్రపంచ రికార్డు!



న్యూఢిల్లీ , అక్టోబరు 24 (వార్తా వేదిక సూర్య): భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అరుదైన ఘనత సాధించాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఫీల్డర్‌గా రికార్డు సృష్టించాడు. న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో రెండు క్యాచ్‌లు పట్టడంతో ఈ మైలురాయిని చేరుకున్నాడు. తద్వారా ఇండోనేషియా ఆటగాడు డానిల్సన్ హావోయే పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు.

**30 ఇన్నింగ్స్‌ల్లో 26 క్యాచ్‌లు**

2026లో ఇప్పటివరకు తిలక్ వర్మ 30 ఇన్నింగ్స్‌ల్లో 26 క్యాచ్‌లు అందుకున్నాడు. గత ఏడాది డానిల్సన్ హావోయే 25 క్యాచ్‌లతో నెలకొల్పిన రికార్డును తిలక్ అధిగమించాడు. న్యూజిలాండ్‌తో రెండో టీ20కి ముందు ఈ రికార్డు సాధించడానికి అతడికి మరో రెండు క్యాచ్‌లు అవసరమయ్యాయి. ఈ మ్యాచ్‌లో టిమ్ సీఫెర్ట్, డారిల్ మిచెల్ క్యాచ్‌లను అందుకోవడంతో చరిత్ర సృష్టించాడు.

**అద్భుత ఫీల్డింగ్‌తో రికార్డు ఖాయం**

భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో న్యూజిలాండ్ ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ భారీ షాట్‌కు ప్రయత్నించాడు. అయితే బంతిని సరిగ్గా కొట్టలేకపోవడంతో కవర్స్ ప్రాంతంలో ఉన్న తిలక్ వర్మ సులభంగా క్యాచ్ అందుకున్నాడు. ఆ తర్వాత భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో డారిల్ మిచెల్ బ్యాట్‌కు తగిలిన బంతి గాల్లోకి లేచింది. వెనక్కి కదులుతూ తిలక్ అద్భుతంగా క్యాచ్ పట్టాడు. దీంతో మిచెల్ వికెట్ దక్కగా, భారత జట్టులోకి తిరిగి వచ్చిన భువనేశ్వర్ ఖాతాలో తొలి వికెట్ చేరింది. ఈ రెండు క్యాచ్‌లతో తిలక్ ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.

**జాబితాలో ఇతర ఆటగాళ్లు**

ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఆటగాళ్ల జాబితాలో యూఏఈకి చెందిన మహమ్మద్ వసీమ్ 2024లో 24 క్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాడు. మలేసియాకు చెందిన షార్విన్ మునియాండి 2025లో 21 క్యాచ్‌లు అందుకున్నాడు. ఉగాండా ఆటగాడు బ్రియాన్ మసాబా 2023లో, బంగ్లాదేశ్ ఆటగాడు తంజిద్ హసన్ 2025లో చెరో 20 క్యాచ్‌లు పట్టారు. ఈ ఏడాది కేవలం 30 ఇన్నింగ్స్‌ల్లోనే 26 క్యాచ్‌లు అందుకోవడం తిలక్ వర్మ ఫీల్డింగ్ సామర్థ్యాన్ని చాటుతోంది. బ్యాటింగ్‌తో పాటు మైదానంలోనూ జట్టుకు కీలకంగా మారుతున్న అతడు, ఈ రికార్డుతో అంతర్జాతీయ క్రికెట్‌లో మరోసారి వార్తల్లో నిలిచాడు.

# టీ20ల్లో.. అభిషేక్ శర్మ అరుదైన ఘనత



ముంబై, అక్టోబరు 24 (వార్త వేదిక సూర్య): భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అరుదైన మైలురాయిని అందుకున్నాడు. ఒకే క్యాలెండర్ ఏడాదిలో వెయ్యికి పైగా పరుగులు సాధించిన భారత ఆటగాళ్ల జాబితాలో చోటు సంపాదించాడు. వేగంగా పరుగులు సాధిస్తూ ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచే అభిషేక్.. తన దూకుడైన ఆటతీరుతో మరోసారి వార్తల్లో నిలిచాడు.

**ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది మందికే అవకాశం**

అంతర్జాతీయ టీ20ల్లో ఒకే క్యాలెండర్ ఏడాదిలో వెయ్యి లేదా అంతకంటే ఎక్కువ పరుగులు సాధించడం అరుదైన ఘనత. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది మంది ఆటగాళ్లు మాత్రమే ఈ మైలురాయిని అందుకున్నారని అందించిన గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈ జాబితాలో అభిషేక్ శర్మ కూడా చేరడంతో భారత క్రికెట్‌లో యువ బ్యాటర్ల ప్రతిభ మరోసారి చర్చకు వచ్చింది.

**సూర్యకుమార్, ఇషాన్ కిషన్ సరసన**

ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక టీ20 అంతర్జాతీయ పరుగులు సాధించిన భారత ఆటగాళ్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ ఇప్పటికే ఉన్నారు. సూర్యకుమార్ 2022లో 1,164 పరుగులు చేయగా, ఇషాన్ కిషన్ 2026లో 1,159 పరుగులు సాధించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తాజాగా అభిషేక్ కూడా వెయ్యి పరుగుల మైలురాయిని అందుకోవడంతో ఈ జాబితాలో మరో భారత ఆటగాడికి చోటు దక్కింది.

**దూకుడే అభిషేక్ ప్రత్యేకత**

టీ20 క్రికెట్‌లో ఆరంభం నుంచే వేగంగా పరుగులు సాధించడం అభిషేక్ శర్మ ప్రత్యేకత. పవర్‌ప్లేలో బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ జట్టుకు మెరుగైన ఆరంభాన్ని అందించగలడు. ఈ క్రమంలో సాధించిన వెయ్యి పరుగుల ఘనత అతడి నిలకడైన ప్రదర్శనకు గుర్తింపుగా నిలుస్తోంది. అయితే ఈ ఏడాది పరుగుల తుది గణాంకాలు, ప్రపంచ ఆటగాళ్ల జాబితాలో అతడి స్థానాన్ని అధికారిక గణాంకాలతో నిర్ధారించాల్సి ఉంది.

# 'నాపై నాకే అంచనాలు లేవు'.. భువనేశ్వర్!



న్యూఢిల్లీ, అక్టోబరు 24 (వార్తా వేదిక సూర్య): దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత టీమిండియాలోకి పునరాగమనం చేసిన సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తనపై తనకు ఎలాంటి అంచనాలు లేవని, వర్తమానంపై దృష్టి పెట్టడమే తన విజయ రహస్యమని తెలిపాడు. దేశం తరఫున ఆడే అవకాశం రావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌కు ఎంపికైన భువనేశ్వర్.. తన పునరాగమనం, ఆట పట్ల తన ఆలోచనా విధానాన్ని వెల్లడించాడు.

**'దేశం తరఫున ఆడటమే గర్వకారణం'**

భారత క్రికెట్ నియంత్రణ మండలి విడుదల చేసిన వీడియోలో భువనేశ్వర్ మాట్లాడుతూ.. మళ్లీ దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నాడు. దేశం తరఫున ఆడటం కంటే గొప్ప గర్వకారణం మరొకటి ఉండదని పేర్కొన్నాడు. ప్రస్తుతం తనపై తానే ఎలాంటి అంచనాలు పెట్టుకోవడం లేదని, గత మూడు, నాలుగేళ్లుగా ఇదే ఆలోచనా విధానం తనకు విజయాలను అందిస్తోందని వివరించాడు. జట్టులో లేని సమయంలోనూ భారత జెర్సీ కోసం ఆరాటపడుతూ ఒత్తిడికి లోనుకాలేదని, తన ముందున్న అవకాశాలు, ప్రస్తుత ఆటపైనే దృష్టి సారించానని తెలిపాడు. అనుభవంతో పాటు ప్రశాంతంగా ఉండటం కూడా ఆటలో కీలకమని అతడి మాటలను బట్టి తెలుస్తోంది.

**ఆర్‌సీబీ ప్రదర్శనతో మళ్లీ జట్టులోకి**

36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ప్రదర్శించిన ఆటతీరుతో మళ్లీ జాతీయ జట్టులో చోటు సంపాదించుకున్నాడు. గత రెండు సీజన్లలో అతడి బౌలింగ్ ప్రదర్శన సెలక్టర్ల దృష్టిని ఆకర్షించినట్లు తెలుస్తోంది. ఐపీఎల్‌లో తన అనుభవాన్ని ఉపయోగించుకుంటూ కీలక సమయాల్లో బౌలింగ్ చేయడం అతడికి కలిసొచ్చింది. సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి రావడం భువనేశ్వర్ కెరీర్‌లో మరో ముఖ్యమైన మలుపు. స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టగల అతడు.. తన అనుభవంతో జట్టుకు ఉపయోగపడాలని చూస్తున్నాడు.

**తొలి టీ20లో వికెట్ దక్కలేదు**

న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో భువనేశ్వర్ నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 49 పరుగులు ఇచ్చాడు. అయితే ఒక్క వికెట్ కూడా సాధించలేకపోయాడు. పునరాగమన మ్యాచ్‌లో ఆశించిన ఫలితం దక్కకపోయినా, రాబోయే మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేయడానికి అతడికి అవకాశం ఉంది. తనపై ఎలాంటి అంచనాలు పెట్టుకోకుండా, ఒక్కో మ్యాచ్‌పై దృష్టి సారిస్తానన్న భువనేశ్వర్.. తదుపరి పోటీల్లో ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. అతడి అనుభవం భారత బౌలింగ్ విభాగానికి ఎంతవరకు ఉపయోగపడుతుందో చూడాలి.



# చెస్‌లో చరిత్ర సృష్టించిన 11 ఏళ్ల బోధన!

లండన్, అక్టోబరు 24 (వార్తావేదిక సూర్య): భారత సంతతికి చెందిన బ్రిటన్ బాలిక బోధన శివానందన్ చెస్ క్రీడలో అరుదైన ఘనత సాధించింది. కేవలం 11 ఏళ్ల 7 నెలల 16 రోజుల వయసులోనే అంతర్జాతీయ మాస్టర్ హోదాను అందుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. తద్వారా ఈ హోదాను సాధించిన అత్యంత పిన్న వయస్కురాలైన మహిళా క్రీడాకారిణిగా ఆమె చరిత్ర సృష్టించినట్లు సమాచారం. చెస్ దిగ్గజం జుడిత్ పోల్గర్ పేరిట ఉన్న పాత రికార్డును బోధన అధిగమించడం విశేషం.

**చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ**

బోధన శివానందన్ చిన్నతనం నుంచే చెస్‌లో తన ప్రతిభను చాటుకుంటోంది. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడుతూ అద్భుత ప్రదర్శనలతో గుర్తింపు తెచ్చుకుంటోంది. సాధారణంగా అంతర్జాతీయ మాస్టర్ హోదా సాధించేందుకు క్రీడాకారులు ఎన్నో ఏళ్లపాటు సాధన చేయడంతో పాటు, నిర్దిష్ట రేటింగ్, ప్రమాణాలను అందుకోవాల్సి ఉంటుంది. అలాంటి కఠినమైన లక్ష్యాన్ని బోధన చిన్న వయసులోనే చేరుకోవడం చెస్ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.

**జుడిత్ పోల్గర్ రికార్డును అధిగమించి..**

ప్రపంచ చెస్ చరిత్రలో అత్యంత ప్రతిభావంతమైన క్రీడాకారిణుల్లో ఒకరిగా పేరొందిన జుడిత్ పోల్గర్ నెలకొల్పిన రికార్డును బోధన అధిగమించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI. Title-Code:- TELTEL12333,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya.yadadri@gmail.com**